## కాల్పుల విరమణకు.. ఇజ్రాయెల్ అంగీకారం

టెల్ అవీవ్ : పశ్చిమాసియాను దాదాపు పదినెలలుగా కుదిపేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టేందుకు తాము చేసిన “బందీల విడుదలకు ప్రతిగా కాల్పుల విరమణ” ప్రతిపాదనకు ఇజ్రాయెల్ అంగీకారం తెలిపిందని.. హమాస్ నుంచి కూడా అదే స్పందనను ఆశిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించారు. టెల్ అవీవ్‌కు చేరుకున్న ఆయన.. ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌ను కలిశారు. అనంతరం జెరూసలెం వెళ్లి ఆ దేశ ప్రధాని నెతన్యాహూతో దాదాపు రెండున్నర గంటలపాటు చర్చలు జరిపారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. “బందీలను వెనక్కి తెచ్చుకోవడానికి, కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి శాంతి, భద్రతల సాధన దిశగా ప్రతి ఒక్కరినీ మెరుగైన బాటలో పెట్టడానికి.. బహుశా ఇదే చివరి, ఉత్తమ అవకాశం” అని బ్లింకెన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ఇక హమాస్ ‘అవును’ అని చెప్పడమే మిగిలి ఉందని పేర్కొన్నారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 209 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 ఆగష్టు 2024 బుధవారం పేజీలు : 4




# తెలంగాణలో మరో రాజకీయ వివాదం..

## రాజీవ్ గాంధీ విగ్రహంపై బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

### తీవ్ర రూపు దాల్చిన విమర్శలు - ప్రతి విమర్శలు

హైదరాబాద్ : తెలంగాణలో మరో రాజకీయ వివాదం రాజుకుంటోంది. అధికార, విపక్షాల మధ్య సవాళ్లు ప్రతిసవాళ్లతో రోజురోజుకూ వేడెక్కుతోన్న రాజకీయంలో ఇప్పుడు రాజీవ్ గాంధీ ఎంటరయ్యారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన గుర్తులు చేరిపేసేలా కాంగ్రెస్ కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, రేవంత్ సర్కార్ మాత్రం తాను చెప్పిందే శాసనం అన్నట్లు దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇంతకీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తాజా వివాదమేంటి? ఈ వివాదానికి రాజీవ్ గాంధీకి సంబంధం ఏంటి? తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయం వాడివేడిగా సాగుతోంది. నిత్యం ఏదో అంశంపై ఇరుపార్టీలు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడుతున్నాయి. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణంపై కొద్దిరోజులుగా మాటల యుద్ధం జరుగుతుండగా, ఇప్పుడు మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. సెక్రటేరియట్ ఎదుట మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనే కాంగ్రెస్ ప్రతిపాదనే ఇప్పుడు ఇరు పార్టీల మధ్య చిచ్చు రాజేసింది. సచివాలయంలో తెలంగాణా తల్లి విగ్రహం ఏర్పాటు కోసం అప్పటి బిఆర్ఎస్ సర్కార్ స్థలం కేటాయించింది. అయితే ఇప్పుడు అదే స్థలంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ప్రతిష్ఠించేందుకు కాంగ్రెస్ సిద్ధం అవుతుండటం అగ్గి రాజేస్తోంది.

**చిన్న అంశాలపైన పెద్ద వివాదం**... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిన్నచిన్న అంశాలపైనా పెద్ద వివాదం కొనసాగుతోందంటున్నారు పరిశీలకులు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన గుర్తులను చెరిపేసేలా కాంగ్రెస్ అడుగులు వేయడం వల్లే ఇలాంటి వివాదాలు వస్తున్నాయని గులాబీదళం గుర్రుగా ఉంది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం చేసిన తర్వాత రాష్ట్రం పేరును సూచించే టీఎస్‌ను టీజీగా మార్చారు. దీనిపై ఇటు కాంగ్రెస్‌బీ అటు బీఆర్ఎస్లో విస్తృత చర్చ జరిగింది. చివరికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పట్టుదలే నెగ్గింది. ఇక ఆ తర్వాత రాష్ట్ర చిహ్నం మార్పుపైనా విస్తృత చర్చ జరిగింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర చిహ్నంలో తొలగిస్తామని స్వయంగా సీఎం రేవంతే ప్రకటించారు. అయితే కాకతీయ తోరణం తొలిగించడంపై వరంగల్ జిల్లా నేతల నుంచి%%% చార్మినార్‌ను తీసేయడంపై ఎంఐఎం నుంచి ఒత్తిడి వచ్చింది. అటు బీఆర్ఎస్ కూడా ఈ అంశాన్ని కోర్టులోనే తేల్చుకుంటామంటూ ప్రకటించింది. దీంతో వెనక్కి తగ్గిన సర్కార్ ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ఇక ఇప్పుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించడం, ఇందుకోసం గతంలో కేసీఆర్ సర్కార్ తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలాన్ని ఎంచుకోవడమే వివాదమవుతోంది. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన భావోద్వేగాన్ని రగిల్చితే ఫలితం ఎలా ఉంటుందోనని టెన్షన్ కాంగ్రెస్‌లోనూ కనిపిస్తోంది. కానీ, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాత్రం ఎలాగైనా రాజీవ్ విగ్రహ ప్రతిష్ఠించాలనే నిర్ణయానికే కట్టుబడినట్లు చెబుతున్నారు.

**విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు :** ఈ నెల 20న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సెక్రటేరియట్ ఎదురుగా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ వచ్చే అవకాశం ఉంది. దీంతో రాజీవ్ విగ్రహ ఏర్పాటుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐతే మాజీ ప్రధాని విగ్రహం ఏర్పాటుపై రాష్ట్రంలో ఇతర పార్టీలతో సంప్రదించి.. ఏకాభిప్రాయం వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తే బాగుండేదని వాదన వినిపిస్తోంది. కానీ, ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంతోనే బీఆర్ఎస్ ఆందోళన చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని తొలగించి.. తెలంగాణా తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ప్రకటన కాక పుట్టిస్తోంది.

## బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా? అభయ కేసులో నిరసనలు!

కోల్‌కతా జూనియర్ డాక్టర్ అభయ హత్యాచార కేసులో సీఎం మమతా బెనర్జీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దేశాన్ని కుదిపేస్తున్న ఈ ఘటనపై మమతా స్పందించిన తీరుపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిరసనలు చేస్తున్న వారిని అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మమతా బెనర్జీ రాజీనామా చేయాలంటు విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

మమత తీరుపై బాధితురాలి పేరెంట్స్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.




**మమతా బెనర్జీపై నమ్మకం పోయింది..** ఈ మేకు కేసు దర్యాప్తులో పోలీసులు వ్యవహరించిన తీరు చూసి తమకు మమతా బెనర్జీపై నమ్మకం పోయిందని అభయ తండ్రి చెప్పారు. కనీసం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అయినా ప్రయత్నం చేస్తోందని నమ్ముతున్నామన్నారు. ‘మమతా బెనర్జీపై నాకు పూర్తి నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు పోయింది. మా కూతురు కోసం అందరూ న్యాయం కావాలని అడుగుతున్నారు. కానీ ఆమె ఎందుకు అలా మాట్లాడుతోంది? ఆ కేసులో ఆమె ఏమీ చేయడం లేదు. మాకు న్యాయం కావాలి అని అడుగుతున్న సామాన్య ప్రజానీకాన్ని లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు’ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మమతా ప్రభుత్వం తీసుకొచ్చిన కన్యాశ్రీ పథకం, లక్ష్మీ పథకాలన్నీ నకిలీవి. ఎవరైతే ఈ పథకాలను పొందాలనుకుంటున్నారో వాటిని పొందే ముందు మీ లక్ష్మి ఇంట్లో భద్రంగా ఉందోలేదో దయచేసి చూసుకోవాలని అభయ తల్లి విమర్శించారు.

## కవిత బెయిల్ పిటిషన్ పై ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై బీఆర్ఎస్ ఫైర్..



న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రాకపోవడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత ఐదు నెలల క్రితం అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఆమెను బయటకు తీసుకు వచ్చేందుకు బీఆర్ఎస్ నేతలు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు ఢిల్లీకి వెళ్లి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. గత వాయిదా సమయం లోనే కవితకు బెయిల్ పక్కా అనుకున్నారు. కానీ అప్పట్లో దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయకపోవడంపై సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఇక ఇవాళ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది కానీ ఈడీ దాఖలు చేయలేదు. దీనిపై శుక్రవారం నాటి కల్లా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ నేతలు వచ్చారు. కవిత బెయిల్ పిటిషన్ పై ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబట్టారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కేజ్రీవాల్ సిసోడియాకే సుప్రీంకోర్టులో బెయిల్ వచ్చిందని.. కవితకు మాత్రం బెయిల్ రాకపోవడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా కవిత ఉన్నారని.. ఆమె బెయిల్ పిటిషన్‌పై ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అకారణంగా కవితను 5 నెలలుగా జైల్లోనే ఉంచారన్నారు. వచ్చే మంగళవారం సుప్రీంకోర్టులో కచ్చితంగా కవితకు బెయిల్ వస్తుందని ప్రశాంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత ఐదు నెలలుగా తిహార్ జైలులోనే ఉన్నారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. దీనిపై ఇవాళ సుప్రీంలో మరోసారి విచారణ జరిగింది. ఇవాళ కూడా కవితకు చుక్కెదురైంది. కవిత కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది కానీ ఈడీ మాత్రం కౌంటర్ దాఖలు చేయలేదు. కవితకు తప్పనిసరిగా ఇవాళ బెయిల్ వస్తుందని సుప్రీంకోర్టుకు పలువురు బీఆర్ఎస్ నేతలు వచ్చారు. కవితకు బెయిల్ పిటిషన్ కేసు వాయిదా పడటంతో వారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మంగళవారం అంటే ఆగస్టు 27 కి వాయిదా వేసింది. శుక్రవారం నాటి కల్లా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి ఆదేశాలు జారీ చేసింది.

# ఇక రైతు భరోసాపై దృష్టి!

## రైతు భరోసాపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..!!




హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసుకుంటూ మందుకు సాగుతుంది. దీనిలో భాగంగా తాజాగా ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా.. రూ. 2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల రుణమాఫీ చేసిన సంగతి తెలిసిందే. మూడు విడతల్లో రైతుల రుణాలు మాఫీ చేశారు. ఇందుకోసం ఏకంగా 31 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. ఇక ఈ హామీ అమలు తర్వాత అన్నదాతలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తోన్న మరో హామీ.. ఎకరాకి ఇంత అని అందించే పెట్టుబడి సాయం అందించే పథకం రైత భరోసా. గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో దీన్ని అమలు చేసింది. దీని కింద ఎకరాకు 5 వేల రూపాయల పెట్టుబడి సాయం అందజేస్తారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పేరు మార్పుతో పాటు.. దీని ద్వారా అందించే మొత్తాన్ని కూడా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కోసం ప్రతి ఎకరాకు రూ. 15 వేలు అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ మొత్తాన్ని రెండు విడతల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటి వరకు ఈ పథకం అమలుకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ క్రమంలో తాజాగా ఓ కీలక అప్డేట్ వెలువడింది. ఆ వివరాలు.. రైతు భరోసా విధివిధానల రూపకల్పన కోసం ప్రభుత్వం కమిటీని కూడా వేసింది. తాజాగా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఖరారైనట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయంలో సాగులో లేని గుట్టలు, కొండలు, రియల్ ఎస్టేట్ భూములకు కూడా రైతుబంధు సాయం అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నిధులు పక్కదారి పట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. రైతు భరోసా పథకం అమలకు లిమిట్ పెట్టాలని భావిస్తోంది. దీనిలో భాగంగా రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా సరే.. 10 ఎకరాల లోపే రైతు భరోసా నిధులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. అంతేకాక సాగులో లేని భూములు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పంట పెట్టుబడి సాయం ఇవ్వకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరో 20 రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇక ఈ పథకాన్ని ఈ ఏడాది దసరా నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. రెండు విడతల్లో ఎకరాకు రూ. 7500 చొప్పున మొత్తం రూ. 15 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అలానే రైతు కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సాయంపైనా మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది అంటున్నారు. మరి కొన్ని రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన రానుంది.

# సంపాదకీయం

## కూటమి ఫస్ట్ బడ్జెట్ అప్పుడే... మెరుపులు ఎన్నో !

ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయి బడ్జెట్ ని ప్రవేశపెట్టలేదు అన్నది తెలిసిందే. జూలై నెలలో మరో నాలుగు నెలల కోసం ఓటాన్ అకౌంట్ కి గవర్నర్ అనుమతి తీసుకుని ఆర్డినెన్స్ ని తెచ్చింది. అయితే ఈ ఏడాది ఇంకా బిగిసి ఆరేడు నెలలు ఉంది. బడ్జెట్ ని ప్రవేశ పెట్టకపోతే దేశ చరిత్రలోనే ఏపీలో కొత్త హిస్టరీ క్రియేట్ చేస్తుంది అని అంటున్నారు. అది నెగిటివ్ గా కూడా స్ప్రెడ్ అయ్యే ప్రమాదం ఉంది అని అంటున్నారు. ముఖ్యంగా ఏపీలో ఇన్వెస్ట్మెంట్ల కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు పెద్ద ఎత్తున చేస్తోంది. కూటమి ప్రభుత్వం బడ్జెట్ నే ప్రవేశపెట్టలేకపోయింది అంటే దాని కంటే బాడ్ ఇమేజ్ వేరొకటి ఉండదని అంటున్నారు. అందుకే బడ్జెట్ ని మరో ఆరు నెలలకు పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టాలని కూటమి ప్రభుత్వం డిసైడ్ అయింది అని అంటున్నారు. వివిధ శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెలాఖరులోగా పంపాలని కూడా అందుకే కోరారని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే బడ్జెట్ కోసమే చంద్రబాబు తాజాగా ఢిల్లీ వెళ్లారని అంటున్నారు. కేంద్రం చేసే సాయం కనుక కచ్చితంగా అవగాహన లోకి వస్తే బడ్జెట్ లో కొత్త మెరుపులు మెరిపించవచ్చు అని ఆలోచిస్తున్నారు. ఈసారి బడ్జెట్ ని ఎలా తీర్చిదిద్దాలి ఏఏ అంశాలను ప్రాధాన్యతలుగా తీసుకోవాలి అన్న దాని మీద చర్చించేందుకు రాష్ట్ర కేబినెట్ ఈ నెల 28న మీట్ అవుతుందని అంటున్నారు. ఇక ఈ బడ్జెట్ లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తారు అని అంటున్నారు. ఈ ఏడాదిలోగా సూపర్ సిక్స్ హామీలు ఎన్ని నెరవేర్చగలం అన్నది కూడా స్టడీ చేస్తున్నారు. ఈ దసరా నాటికి ఉచిత బస్సు సదుపాయం మహిళలకు కల్పించాలని ఆలోచిస్తున్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలెండర్లను ఏడాదికి మూడు అన్నవి కూడా కేంద్ర సాయంతో అమలు చేయడం కోసం చూస్తున్నారు. అదే విధంగా రైతు భరోసాని ఏకంగా సంక్రాంతికి మార్చి ఇవ్వాలని చూస్తునారు. సంక్రాంతి రైతుల పండుగ కాబట్టి సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవుతుందని యోచిస్తున్నారు. అలాగే మరో నాలుగైదు నెలలకు ఆ హామీ అమలు చేయడం ద్వారా భారాన్ని అప్పటికి మోయగలిగే స్థితికి ఏపీ ఖజానా రావచ్చు అని అంచనా వేస్తున్నారు. ఇక టీడీపీ కూటమి ప్రభుత్వం తొలిసారి ప్రవేశపెట్టే బడ్జెట్ లో అమరావతి రాజధాని హైలెట్ గా ఉండబోతోంది అని అంటున్నారు. అమరావతి రాజధానికి ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయల రుణాన్ని అందించేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదముద్ర తెలిపిన సంగతి తెలిసిందే. ఆ నిధులతో ఒక స్టేజ్ దాకా అమరావతిని తేవచ్చు. దాంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు కేంద్రం సైతం అంగీకరిస్తున్న నేపథ్యం ఉంది. ఏపీ ప్రభుత్వం తన పలుకుబడితో పెట్టుబడులను ఎటూ ఆహ్వానిస్తోంది. అలాగే చాలా సంస్థలకు భూములను కూడా ఇస్తోంది. దాంతో అమరావతి రానున్న మూడు నాలుగేళ్లలో ఒక రూపునకు షెపునకూ వస్తుందని అంటున్నారు. ఈ విషయాలనే అడ్జెట్ లో చెప్పడం ద్వారా ఏపీ ప్రజలలో కొత్త ఆశలను రేకెత్తిస్తారు అని అంటున్నారు. అలాగే చంద్రబాబు తాజా ఢిల్లీ పర్యటనలో పోలవరం నిధులకు సంబంధించి కూడా ఒక క్లారిటీ వచ్చింది అని అంటున్నారు. తొందరలో కేంద్ర కేబినెట్ సమావేశమై పోలవరం ప్రాజెక్ట్ కి సంబంధించి సవరించిన అంచనా వ్యయనికి ఆమోదముద్ర వేస్తే ఇక నిధుల వరద పారుతుందని అంటున్నారు. ఆ విషయంలో కూడా ఒక అవగాహన వస్తే బడ్జెట్ లో దానిని కూడా పెట్టి పోలవరం ఎపుడు పూర్తి చేస్తామో కూడా కూటమి ప్రభుత్వం ప్రజలకు చెప్పనుంది అని అంటున్నారు. మొత్తానికి చూస్తే కూటమి బడ్జెట్ కాస్తా లేట్ అయినా లేటెస్ట్ గా అనేక సంచలనాలతోనే ఉంటుందని అంటున్నారు. సెప్టెంబర్ లో బడ్జెట్ సెషన్ కోసం ఇపుడు కూటమి సర్కార్ గట్టి కసరత్తునే చేస్తోంది అని అంటున్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు అజరామరం



శామీర్ పేట, (గరుడ వార్త) : స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు అజరామరమని తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ప్రధాన మంత్రి భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 80 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ పదవీ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. 40 సంవత్సరాల వయస్సులో భారతదేశపు అతి పిన్న వయస్కుడైన ప్రధాన మంత్రి అయ్యాడని చెప్పారు. అతని పదవీ కాలంలో, భారతదేశాన్ని ఆధునీకరించడం, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు, విధానాలను ప్రవేశపెట్టారన్నారు. భారతదేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు "విజన్ 2020" కార్యక్రమాన్ని ప్రారంభించి, సాంకేతికత, కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్‌లను యువతకి అందించారన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి యువత కౌమర దశ దాటగానే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని గొప్పగా సంకల్పించిన సంస్కరవాది అన్నారు. 73, 74 రాజ్యాంగం సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నేరుగా నిధులను అందజేసి గ్రామాలు అభివృద్ధి చేందాలని ఆలోచన చేసిన గొప్ప మహనీయుడని చెప్పారు. యువకులకు అనేక ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించారని, చట్టసభలలో స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదే అన్నారు. అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఆయన చేసిన గోప్ప కార్యక్రమాలకు గుర్తుగా వై.యస్.ఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో శంషాబాద్ లో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్ గాంధీ పేరు పెట్టారని, పేద ప్రజలు కార్పొరేట్ హాస్పిటల్లో ఉచితంగా వైద్యం చేయించుకునే విధంగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టి ఎంతోమంది పేదలకు మేలు చేశారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అలాగే శామీర్ పేట మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో మాజీ ఉపసర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కార్యదర్శి తిగుళ్ల మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు భీమిడి కొండల్ రెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట జగదీశ్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ చిర్రబోయిన రామ్ చందర్ యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తిగుళ్ల దర్శన్ గౌడ్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చింతల మనోహర్ రెడ్డి, వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలగామ జగన్, నాయకులు పాండు, సాయి, వార్డుల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలాకుర్తి బాను, మోర నరేష్, ప్రధాన కార్యదర్శి మమిన్ల హరివర్ధన్, యూత్ కాంగ్రెస్ నాయకులు కుక్కునూరు భాను, సాయిరామ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రారు కార్యాలయం షామీర్పేట తాహసిల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బీ జే పీ కో కన్వీనర్, అడ్వకేట్ నలగామ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, ప్రభుత్వ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. గత 1996 నుంచి ప్రస్తుతం వరకు ప్రైవేట్ బిల్డింగ్ లో అద్దెకు తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం కొంతమంది స్వార్థపరులు హైవే పక్కన ఉన్న బిల్డింగ్ దర్గా చౌరస్తాలో కి మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అట్టి బిల్డింగ్ లోనికి మారిస్తే ఖాళీ స్థలం లేనందున పార్కింగ్ సమస్య వస్తుందన్నారు. పైగా దర్గా చౌరస్తా వద్ద రోడ్డు ఇరుకుగా ఉందని, అక్కడ ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. తమరు ఇట్టి విషయంలో గతంలో అభ్యంతరాలు ప్రజలు తెలియజేయడం జరిగినదని, తమరు దయచేసి పరిశీలించి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న ఖాళీ బిల్డింగ్లోనికి మార్చాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పార్కింగ్ సమస్య ఉండదని, పైగా ప్రభుత్వానికి దుకాణ సముదాయాలతో అద్దె ఆదాయంగా వస్తుందని తెలియజేశారు. ఇట్టి విషయంపై విచారణ చేపట్టి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కోరారు.

# కేటీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు

## రాజకీయాలు మీకు..మాకు అవసరమే




కానీ ఏం మాట్లాడాలో..ఎలాంటి విషయాలు మాట్లాడాలో తోయడం లేదు . కేటీఆర్.. ఎక్కడైనా పొలిటికల్ కోచింగ్ సెంటర్ ఉంటే కోచింగ్ తీసుకో బెటర్ . రాజీవ్ గాంధీ దేశ ప్రజల కోసం బలిదానం అయ్యారు . మిలిటెంట్లు కాల్చి చంపింది నిజమే కదా ? కేసీఆర్ గారు.. కేటీఆర్ కి కొంత ట్రైనింగ్ ఇప్పించండి. రాజీవ్ గాంధీ విగ్రహం సెక్రటేరియట్ ముందు తీసేస్తం అంటాడా..? . ప్రజలు మాకు ఐదేళ్లు అధికారం ఇచ్చారు . రాజీవ్ గాంధీ .. 18 ఏండ్లు ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారు. . కేటీఆర్.. అమెరికా లో ఐటి ఉద్యోగం చేసిన అంటున్నావు.. ఆ ఐటి నీ తెచ్చింది రాజీవ్ గాంధీ . తెలంగాణ లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఐటి కి పునాది వేశారు రాజీవ్ గాంధీ తెచ్చిన టెక్నాలజీ తో ఉద్యోగం తెచ్చుకుని ఆయన్నే తిడితే నిన్ను ఏమనాలి..?నువ్వు విగ్రహం తీసేస్త అంటే... మేము చూస్తూ ఊరుకుంటం అనుకుంటున్నావా?ఈ నాలుగేండ్లు రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకునే ధైర్యం ..దమ్ము నీకు లేదు వచ్చే ఐదేళ్లలో కూడా నీకు ప్రజలు అవకాశం ఇవ్వరు..?మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..నీకు నో ఛాన్స్‌మా సిఎం రేవంత్ నీ... చీప్ మినిస్టర్ అంటున్నావు.. కేటీఆర్ మాటలు చీప్ లిక్కర్ తాగిన వాడి మాటల లెక్క ఉన్నాయి కల్లు తాగిన కోతిలెక్క దుంకులాడుతున్నాడు.. కేటీఆర్‌సోనియా గాంధీ..రాహుల్ గాంధీల కు నీతిగా గులాం గురి చేస్తాం.. మీ లెక్క కన్నింగ్ కాదు మేము తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఇంటికి మీ కుటుంబం అంతా వెళ్లి ఆమె కాళ్ళ మీద పడ్డప్పుడు ఏమైంది.. అప్పుడు మీరు కూడా గులాం చేసినట్టేనా?నీకు అధికారమే రాదు.. ఇంకా ఎయిర్ పోర్ట్ పేరు ఎట్లా మారుస్తాడు కేటీఆర్‌పొలిటికల్ పవర్ ఊహించుకోకండి కేటీఆర్‌సోనియా గాంధీ మన్ననలు పొందటానికి ప్రయత్నాలు చేయలేదా?అల్లం నారాయణ మేధావి కాదు.. కేసీఆర్ కి బంగ్రోతుపదేళ్లలో జర్నలిస్టుల కష్టాలు..ఇండ్లు గురించి కేసీఆర్ నీ అడిగాడా.. అల్లం నారాయణ ఓ జోకర్..కెసిఆర్ అయ్య జాగిరా...సెక్రటేరియట్ ముందు జాగా.. ఎందుకు పెట్టొద్దు రాజీవ్ గాంధీ విగ్రహంపిల్లలు భావిభారత పౌరులు..వాళ్లకు అన్ని విషయాలు తెలియాలి కాబట్టి వాళ్ళ ముందు రాజీవ్ గాంధీ గురించి మాట్లాడారు.కేటీఆర్..నీ అయ్య చారానా చేస్తే భారానా చెప్ప లేవా? రాజీవ్ గాంధీ విగ్రహం తీసేస్తా అనడానికి.. కేటీఆర్ ఎవ్వడు ఆయనకేం సంబంధంతెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ పరిస్థితి శివలింగం మీద తేలు లాంటి పరిస్థితిఐనా.. నేను కేసీఆర్ నీ సవాల్ విసిరి బయటకు రాకుండా చేసిన నేను తల్లి గుండెల్లో ఉండాలి.. అందుకే తెలంగాణ తల్లి విగ్రహం సెక్రటేరియట్ లోపల పెడతున్నం మేముకేటీఆర్ కుస్తికి వస్తె కుస్తీ కి సిద్ధం మేముపదేళ్లు తెలంగాణ ప్రజలకు నరకం చూపించారు కేసీఆర్ సిఎం విగ్రహం మీద చెయ్యి వేస్తే చెప్పుతో కొడతాం అన్న మాటలకు మద్దతుఇప్పుడున్న రాజకీయాల్లో క్రైమ్ లీడర్స్.. లూజ్ లీడర్స్ కి మొగుడు రేవంత్ రెడ్డే రాజీవ్ గాంధీ పై లూజు గా మాట్లాడిన నేతలకు మొగుడు.. రేవంత్‌మీ అయ్య మాట్లాడితే ఇంపు.. మేము మాట్లాడితే కంపా

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అర్కెలగూడెం కు చెందిన కీ.శే. వాసగౌని చంద్రయ్య గౌడ్ జ్ఞాపకార్థం ఆయన భార్య వెంకటమ్మ, కుమారుడు వెంకటేష్ గౌడ్– రజిత దంపతులు, కుటుంబ సభ్యులు, నేహా, సంజన అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే

శామీర్ పేట, (గరుడ వార్త) : ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో గానో అండగా నిలుస్తూ భరోసానిస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట, మజీద్ పూర్ గ్రామాల కు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి



సహాయ నిధితో లబ్ధి చేకూరుతుంది అన్నారు. శామీర్ పేటకు చెందిన సావిత్రి, మజీద్ పూర్ కు చెందిన జ్యోతిలు అనారోగ్యానికి గురై చికిత్స పొందారని, వారు ఆర్థిక ఇబ్బందులతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా సావిత్రికి రూ.30 వేలు, జ్యోతికి రూ.60 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సాయం మంజూరు అయింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏఈ సురేందర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దమర్రి విద్యుత్ సబ్ స్టేషన్ లో 11కేవీ స్నేహ పౌల్ట్రీ ఫారం ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు ఉద్దమర్రి గ్రామానికి, స్నేహ పౌల్ట్రీ ఫారంలతో పాటు పలు ఇండస్ట్రీస్ కు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కెవి ఎల్లగూడ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఎల్లగూడ గ్రామం, వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.

# ర్యాంకుల్లో ఎప్పుడు మెరిసేది!

కరీంనగర్ : కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)–2024లో.. ఉమ్మడి జిల్లాతో ముడిపడిన శాతవాహన విశ్వవిద్యాలయం సహా ఇతర విద్యా విభాగాల ఊసే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.. దీంతో విద్యార్థుల భవితను తీర్చిదిద్దే ఉన్నతవిద్యకు మరింత వన్నె తేవాల్సిన అవసరముందన్న విషయం స్పష్టమవుతోంది. ముఖ్యంగా డిగ్రీ ఆ పైస్థాయి చదువరుల విషయంలో మరింత నాణ్యమైన బోధన, సౌకర్యాల కల్పన విషయంలో సహకారమందాలి. విద్య, వికాసం, మెరుగైన ఫలితాలు, వసతుల తీరు.. ఇలా భిన్నమైన కోణాల్లో జరిపిన పరిశీలనల్లో మన దగ్గరి పరిస్థితులు కనీస ప్రమాణాలకు దరిదాపుల్లో లేకపోవడం ఒక గుణపాఠాన్ని నేర్పిస్తోంది.

**ఆసక్తి చూపినా.. ఫలితం శూన్యం**

ఉమ్మడి జిల్లా నుంచి 10 కళాశాలలు ర్యాంకుల కోసం పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 డిగ్రీ కళాశాలలు ఇందులో ఉండగా.. ఉమ్మడి జిల్లా నుంచి గోదావరిఖని, హుజూరాబాద్, కోరుట్ల, జమ్మికుంట, పెద్దపల్లి, అగ్రహారం, గంభీరావుపేట, మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తోపాటు కరీంనగర్, జగిత్యాలలోని మహిళా డిగ్రీ కళాశాలలు, జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ర్యాంకు కోసం పోటీ పడ్డాయి.

మరోవైపు 12 ఇంజినీరింగ్ కళాశాలలకు కేవలం 5 మాత్రమే దరఖాస్తు చేసుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో వైద్య కళాశాలలు ఇప్పుడిప్పుడే వసతులు, బోధన పరంగా ముందుకు వెళ్తుండడంతో వీటి ప్రస్తావనే



లేదు. ప్రైవేటు కళాశాలలు ఉన్నా దరఖాస్తు చేసుకోలేదు. బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలు ఉన్నా.. ఈ ర్యాంకుల దిశగా దృష్టి సారించలేదు.

**కొన్నేళ్లుగా గుర్తింపు లేదు..**

ఎన్ఐఆర్ఎఫ్ 2015 నుంచి ఆయా రాష్ట్రాల్లోని విద్యాసంస్థల ప్రగతిని ర్యాంకుల రూపంలో ఒక నివేదికను అందిస్తోంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కోర్ కమిటీ విద్యాపరంగా వనరులు, పరిశోధనలు, వృత్తిపరమైన అభ్యాసాలు, గ్రాడ్యుయేషన్ ఫలితాలు మొదలగు వాటిని భిన్నమైన కోణాల్లో గమనిస్తూ ఏటా వాటికి ర్యాంకులను ఇస్తుంది. మొత్తంగా 16 రకాల విద్యా సంబంధిత సంస్థల తీరు తెన్నుల్ని పర్యవేక్షిస్తుంది. ఆయా కళాశాలల నుంచి వచ్చిన ప్రతిపాదనలను గమనిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని తెలుసుకుని స్థానాల్ని కేటాయిస్తుంది. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ఒక్క విద్యా సంస్థకు తగిన గుర్తింపు రాలేదు.

**ఇవి అమలైతేనే..**ఉన్నత విద్య పరంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు రావాలి. సాధారణ బోధనే కాకుండా ప్రాక్టికల్ పరంగా పురోగతి పెరగాలి.

విద్యార్థుల్లో సాంకేతికత, కంప్యూటర్ సహా ఇతర నూతన విధానాల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి.

ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సొంత భవనాలు, కనీస వసతుల పరంగా ఇబ్బందులున్నాయి. బోధన సిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలి. భిన్నమైన అంశాల్లో కార్యశాలల నిర్వహణ సహా ప్రాజెక్టుల రూపకల్పనలో వైవిధ్యం జోడించేలా బోధన పరంగా ప్రత్యేకతలు కనిపించాలి. కొత్త కోర్సుల్లో సత్తా చాటే ప్రావీణ్యం విద్యార్థుల్లో పెరగాలి. ప్రయోగాలపై పట్టు సాధించాలి. నిధుల పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం సంపూర్ణంగా అందాలి. ప్రతిభను గుర్తించే విధంగా పలు పోటీలతో ప్రజ్ఞను వెలికితీయాలి.

జిల్లాకే పరిమితమవకుండా రాష్ట్ర, జాతీయస్థాయి విద్యాపరమైన పోటీలలో మన విద్యార్థులు భాగస్వామ్యమై విద్యా వికాసాన్ని మరింత పెంపొందించాలి.


# అంగన్వాడీలకు మంచి రోజులు

ధన్వాడ : త్వరలో 11వేల అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేసిన ప్రకటన మహిళా నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. ఖాళీలు భర్తీ అయితే అంగన్‌వాడీల నిర్వహణ మరింత బలోపేతం అవుతుం దనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం అంగన్‌వాడీలలో చాలావరకు కార్యకర్త లేదా ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో మొత్తం 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కార్యకర్తల ఖాళీలు 32 ఉండగా ఆయాల ఖాళీలు 105 ఉన్నాయి. పై రెండింటి ఖాళీలను కూడితే మొత్తం 137 అవుతున్నాయి. ఉన్న మొత్తంలో వీటిని లెక్కకడితే 20 శాతానికి సమానం అవుతున్నాయి. ఖాళీలు పలు కారణాలతో



ఏర్పడ్డాయి. ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను పెద్ద అంగన్‌వాడీలుగా మార్పులు చేసింది. మినీ అంగన్‌వాడీలో ఒకే ఉద్యోగి ఉంటుండగా ఆమె ఇపుడు కార్యకర్తగా మారింది. ఇక్కడ ఆయాలను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం పెద్ద అంగన్‌వాడీలుగా మారిన కేంద్రాలలో ఆయా పనులను సైతం కార్యకర్తలే నిర్వహిస్తున్నారు. నిత్యం కేంద్రాన్ని క్లీన్ చేయడం, ఇక్కట వెళ్లి పిల్లల్ని తీసుకురావడం, వంట పాత్రలు శుభ్రపర్చడం, వండటం, బోధించడం లాంటి పనులన్నింటిని కార్యకర్తలు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పని ఒత్తిడి వల్ల ఒక్కోసారి పోషకాహారం తయారీలో జాప్యం జరుగుతుంది. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలతో మాట పడాల్సి వస్తోంది. ఒత్తిళ్లతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నట్లు పలువురు కార్యకర్తలు, ఆయాలు వాపోతున్నారు. పలు కేంద్రాలలో ఆయాలు వయోభారంతో పదవీ విరమణ పొందారు. మరి కొందరు వయసు సహకరించక స్వచ్ఛందంగా వైదొలుగుతున్నారు. కొందరు కార్యకర్తలు రాజీనామాలు చేశారు. వీటన్నింటి కారణాలతో పై ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం రెండున్నరేళ్ల వయసు పిల్లల్ని కేంద్రాలలో చేర్పించాలని నిర్ణయించడం, ప్రీ స్కూల్గా కేంద్రాలను మారుస్తుండటం, బోధనలో కొత్త పుంతలు తొక్కుతుండటం లాంటి కారణాలతో ఖాళీల భర్తీకి నిర్ణయించింది.

# మిశ్రమ పంటలు.. సాగు ఆశాజనకం



తాండూరు: జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్ కింద మిశ్రమ పంటలు ఆశాజనకంగా సాగౌతున్నాయి. ఈ ఏడాది పప్పు ధాన్యాలకు ఎక్కువ ధరలు ఉండవచ్చనే ఆశతో రైతులు మిశ్రమ పంటలుగా కంది, పెసర, మినుము, బొబ్బర్లు వంటి వాటిని ఎక్కువగా సాగు చేశారు. ఇలా చేయడం వల్ల ఒకటి నష్ట పోయినా మరో దాని నుంచి మంచి దిగుబడులు సాధించి ఆర్థిక లబ్ధి పొందవచ్చనే ఉద్దేశంతో ఉన్నారు. ఆ మేరకు సాగులో ఉన్న పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

**4.35 లక్షల ఎకరాలకు పైబడి..**

జిల్లా వ్యాప్తంగా 5,78,874 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగు చేయాల్సి ఉండగా 4.35లక్షల ఎకరాలకు పైబడి పంటలు సాగయ్యాయి. జిల్లాలోని 20 మండలాల్లో మిశ్రమ పంటల సాగు 30వేల ఎకరాలకు పైనే ఉంది. ఇందులో పత్తిలో మిశ్రమ పంటగా సాగైన కంది పంటనే 16వేల ఎకరాలకు పైబడి ఉంది. రైతులు పత్తింకంది, పెసరంకంది, మినుముంకంది, జొన్నంకంది, పసుపు మొక్కజొన్న వంటి తదితర పంటలను మిశ్రమంగా సాగు చేశారు. మిగిలిన పంటలు మరో 14వేల ఎకరాలకు పై బడి ఉన్నాయి. ఈసారి 100 శాతం వానాకాలం సాగు లక్ష్యంలో ఇప్పటికే 72.15 శాతానికి చేరుకుంది. జిల్లాలో వరి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ముందుగా నారు పోసుకున్న రైతులు ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలను ఆధారం చేసుకుని రైతులు పనులు చేపట్టారు.

చీడపీడల నివారణకు మందుల కొనుగోలు: రైతులు పంటలను ఆశించిన చీడపీడలను నివారించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈమేరకు వారు ఏఏచీడపీడల నివారణకు ఎలాంటి మందులు కావాలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో దుకాణాలకు రైతుల తాకిడి పెరిగింది.

**స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవచ్చు**

వానాకాలం సాగులో వెనుకబడిన రైతులు స్వల్పకాలిక పరిధిలోకి వచ్చే కందులను మొలక శాతం ఎక్కువగా ఉండేలా చూసుకుని విత్తుకోవచ్చు. జొన్నను కూడా ఇదే పద్దతిలో విత్తుకోవాలి. వరి సాగును ఆగస్టు చివరి వరకు చేపట్టవచ్చు. చీడపీడలు, కలుపు మొక్కల నివారణ పనుల చేయవచ్చు.- డాక్టర్ సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు.

**శతశాతానికి మించి పత్తి**

వానాకాలం పంటల సాగులో ప్రధానమైన పత్తి పంటను రైతులు శతశాతానికి మించి సాగు చేశారు. 2,31,338 ఎకరాల్లో సాధారణ సాగు చేయాల్సి ఉంటే 2,41,592 ఎకరాల్లో పంట సాగైంది. ఇది 104.43 శాతంగా ఉంది.

# స్థలాల క్రమబద్ధీకరణ కసరత్తు షురూ



వికారాబాద్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో జిల్లాలోని ఆయా శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి తగిన విధంగా తర్ఫీదునిచ్చి క్రమబద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తారు. క్షేత్రస్థాయిలో ప్లాట్లను తనిఖీ చేయడం, దరఖాస్తుదారుల పరిశీలించటం వంటి ప్రక్రియను పూర్తి చేస్తారు. జిల్లాలో స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ మూడు సంవత్సరాలకోసారి సాగుతోంది. ఈసారి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి.

**గతంలో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో పురపాలిక, గ్రామ పంచాయతీ పరిధిలో 2022 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. నాటి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయంలో వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు సమాచారం అందుతుంది. వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, పట్టణ ప్రణాళిక పంచాయతీ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది.

క్రమబద్ధీకరణ నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో, మున్సిపాలిటీల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రక్రియను ప్రతి వారం సమీక్షిస్తారు. ఈ కేంద్రాలో దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందజేస్తారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు.

**మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు**

ప్రస్తుతం పురపాలిక సంఘాలు నిధులు లేక నీరసిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్లాట్లు మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు చేయనుంది. ఎల్ఆర్ఎస్–2019 పథకం కింద స్వీకరించిన దరఖాస్తులు 4023 కాగా వసూలు చేసిన ఫీజు రూ.56.90 లక్షలుగా ఉంది. **మండలాల వారీగా బృందాల ఏర్పాటు** – లింగ్యానాయక్, జిల్లా అదనపు పాలనాధికారి, వికారాబాద్.


జిల్లాలో ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశాం. దీని కోసం ప్రత్యేకంగా యాప్‌ను వినియోగిస్తున్నారు. యాప్‌ను వినియోగించే విధానాన్ని తెలుసుకోవడానికి బృందాలకు తగిన శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది.

# బంగ్లా సంక్షోభం.. నేతన్నలకు అవకాశం

సిరిసిల్ల: అంతర్జాతీయ వస్త్రోత్పత్తుల ఎగుమతుల్లో చైనా, బంగ్లాదేశ్, వియత్నాం తర్వాత మన దేశం నాలుగో స్థానంలో ఉంది. మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ సంక్షోభం నెలకొంది. దీని ప్రభావం ఆ దేశంలోని టెక్స్‌టైల్ రంగంపైన చూపనుంది. ఇప్పటికే అక్కడికి వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఇచ్చే అంతర్జాతీయ సంస్థలు మన దేశం వైపు చూస్తున్నాయి. చెన్నై, మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత మరమగ్గాలపై వస్త్రోత్పత్తులకు ప్రసిద్ధి సిరిసిల్ల. ఈనేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోని వస్త్రపరిశ్రమకు అంతర్జాతీయ ఆర్డర్లు పెరిగితే దేశీయంగా డిమాండ్ ఉన్న వస్త్రోత్పత్తులపై మన జిల్లా వస్త్రోత్పత్తిదారులు దృష్టి సారిస్తే లబ్ధిచేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మరమగ్గాలున్నాయి. ఇవి పూర్తిస్థాయిలో పని చేస్తే రోజుకు సుమారు 13.20 లక్షల మీటర్ల పాలిస్టర్, 6.60 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తులు జరుగుతాయి. అరకొరగా వస్తున్న ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు ఉపాధి అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా పరిశ్రమకు మహారాష్ట్ర, గుజరాత్, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్డర్లను పీస్‌రేట్ పద్ధతిలో ఉత్పత్తి చేసి ఇవ్వడం ద్వారా ప్రస్తుతం ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో తయారయ్యే కాటన్ వస్త్రాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ తయారైన వస్త్రాన్ని చెన్నైలోని ఈరోడ్, రాజస్థాన్‌లోని బల్వొత్రాలోని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి అత్యాధునిక అద్దకం యూనిట్లలో రంగుల అద్దకం పూర్తయ్యాక ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతోంది. జిల్లాలో మూడంచెల వ్యవస్థలోని పరిశ్రమలో యజమానుల ఆర్డర్లతో ఆసాములు, కార్మికులు వస్త్రాలను ఉత్పత్తి చేసి ఉపాధి పొందుతారు.


బంగ్లాదేశ్‌లోని రాజకీయ సంక్షోభం అక్కడి టెక్స్‌టైల్ ఉత్పత్తులపైనా



చూపనుంది. టెక్స్‌టైల్ రంగానికి కావాల్సిన ముడి సరకును ఎగుమతి చేయడంతో చైనా తర్వాత బంగ్లాదేశ్ రెండో స్థానంలో ఉంది. ఇక్కడ వస్త్రోత్పత్తులను తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేస్తారు. ప్రభుత్వ రాయితీలు, తక్కువ వేతనాలతో పని చేసే కార్మికులు ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. ఈక్రమంలో ఆ దేశానికి వెళ్లే యూరోపియన్ బ్రాండ్ సంస్థలు మన దేశంలోని తిరుపూరు, ఈరోడ్, ఇచ్చల్‌కరంజీలోని ఉత్పత్తిదారులకు ఇస్తున్నారు. చెన్నై, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని మరమగ్గాల పరిశ్రమలో కాటన్, పాలిస్టర్, నిట్‌వేర్ వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండటంతో ఇక్కడ తయారయ్యే వస్త్రాలు జాతీయ, అంతర్జాతీయంగా గార్మెంట్ పరిశ్రమలకు ఎగుమతి అవుతున్నాయి. సిరిసిల్లలోని గ్రీన్‌నిడిల్ గార్మెంట్ పరిశ్రమకు ఇక్కడి నుంచే వస్త్రం దిగుమతి అవుతుంది. అంతర్జాతీయ సంస్థలు దేశంలోని వస్త్రోత్పత్తి ప్రాంతాల ఉత్పత్తి సామర్థ్యాల వివరాలను సేకరిస్తున్నాయి. కాగా జిల్లా వస్త్రోత్పత్తిదారులు దేశీయ ఉత్పత్తులపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీంతో ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న పరిశ్రమకు జాతీయ స్థాయి వస్త్రోత్పత్తుల్లో పట్టుసాధించే అవకాశాలు ఉన్నాయి.

# వరి పంటకే మొగ్గు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఎప్పటిలాగే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో కూడా రైతులు వరి పంట వైపే మొగ్గు చూపారు. మొత్తం 1,99,021 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా ఇందులో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు చేశారు. రెండో స్థానంలో పత్తి పంట ఉండగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కంది పంటలు వరుసగా రెండు, మూడో స్థానాలకు పరిమితమయ్యాయి. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఏ మాత్రం ఊరటనివ్వడం లేదు. భారీ వర్షాలు లేకపోవడం వల్ల నీటి వనరుల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరడం లేదు. దీంతో జిల్లాలో చాలా వరకు చెరువులు, కుంటల్లో సాగునీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. భూగర్భజల మట్టాలు సైతం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బోరుబావులు, బావుల్లో నీటిధార క్రమంగా తగ్గిపోతోంది. మరికొన్ని ప్రాంతాల్లో సీజనల్ బోర్లు ప్రస్తుతానికి సాగునీరు అందిస్తున్నా వర్షాలు పడకపోతే వెనక్కి తగ్గే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని 516 చెరువుల్లో కొన్ని మినహా అధికశాతం నిండకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఎగువమానేరు, సింగసముద్రం చెరువుతోపాటు వంద ఎకరాలకు



పైగా ఆయకట్టు కలిగిన ఇతర నీటి వనరులు వెలవెలబోతున్నాయి. ఈనేపథ్యంలో వరి పంటను సాగు చేసిన అన్నదాతలు భారీ వర్షాలపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,83,080 ఎకరాలకు గాను ఈ నెల 12 వరకు 1,49,580 ఎకరాల్లో సాగు చేశారు. మరో వారం లోపు వరినాట్లు వేసే ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అన్ని మండలాల్లో వరి సాగుకే రైతులు ప్రాధాన్యతనిచ్చారు.

8 మండలాల్లో...ఈ సంవత్సరంలో ఈ నెల 13 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 450.2 మిల్లీ మీటర్లు కాగా, 511.4 మిల్లీ మీటర్లు కురిసింది. సాధారణం కంటే 14 శాతం ఎక్కువ కురిసింది.

సాధారణ వర్షపాతం నమోదైన మండలాలు

రుద్రంగి, వేములవాడ గ్రామీణం, సిరిసిల్ల, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి

లోటు: గంభీరావుపేట అధికం: చందుర్తి, బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట


వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి– చాడ భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల మొగిపురుగు తక్కువగా ఉంది. ఎక్కడైనా మొగిపురుగు ఆశిస్తే ఎకరానికి 8 కిలోల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను నాట్లు వేసిన 18 నుంచి 25 రోజుల లోపు చల్లాలి. పొలాన్ని ఆరబెడుతూ నీటిని అందిస్తే ఎదుగుదల ఎక్కువగా ఉంటుంది. ఆకులు పసుపు వర్ణం, ఆ తర్వాత గోధుమ రంగులోకి మారి, పెలుసుగా తయారైతే జింక్‌లోపంగా గుర్తించాలి. జింక్ లోపం నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి, వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

# పరిశుభ్రతపై శ్రద్ధేదీ?

కందనూలు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలు దాడి చేస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ఆసుపత్రులకు రోగుల సంఖ్య పెరుగుతోంది. అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో రోజూ 800 నుంచి 950 వరకు ఓపీ నమోదు అవుతోంది. కల్వకుర్తి సివిల్ ఆసుపత్రిలో 350, అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో 280, కొల్లాపూర్ సివిల్ ఆసుపత్రిలో 225 వరకు ఓపీ నమోదు అవుతోంది. మూడు, నాలుగు రోజుల పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు నమోదు కాకపోయినా నొప్పులు, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

రోగుల తాకిడి.. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడానికి జిల్లా వైద్యారోగ్యశాఖ, పట్టణాల్లోని పురపాలక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే నామమాత్రంగా నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పుర, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారు తప్ప దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు తప్ప శివారు



కాలనీల్లో పరిసరాలు శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇళ్ల మధ్య నీరు చేరి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి.

9 డెంగీ కేసులు నమోదు

జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు 9 డెంగీ కేసులు, మలేరియా 06, టైఫాయిడ్ 5 కేసులు నమోదు అయ్యాయి. జులై నెలలో లింగాల మండలం చెన్నారంలో ఓ వ్యక్తికి, ఆగస్టు 10న నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఓ వ్యక్తికి డెంగీ సోకింది. అత్యవసర పరిస్థితిలో కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటుండటంతో డెంగీ, టైఫాయిడ్ కేసులు రికార్డుల్లో నమోదు కావడం లేదు. వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్పిన దాని కంటే క్షేత్ర స్థాయిలో కేసులు ఎక్కువగానే నమోదవుతున్నట్లు తెలుస్తోంది. అవగాహన కల్పిస్తున్నాం – తారాసింగ్, జిల్లా ఉపవైద్యాధికారి, అచ్చంపేట

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పలు రకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాలు, పట్టణాల్లో డ్రై డే నిర్వహిస్తూ పరిసరాలు శుభ్రంగా చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసుపత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

# నిధులు జాప్యం.. పనులు అర్ధాంతరం

గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ప్రకటించగా సకాలంలో విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు పనులు చేసిన గుత్తేదార్లు బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారు. రామగుండం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో అంచనాలు సిద్ధం చేసి టెండర్లు నిర్వహించిన అధికారులు పనులు మొదలు పెట్టారు. మొదటి సంవత్సరం కొంత మేరకు నిధులు విడుదలైనప్పటికీ ఆ తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఒక్కొక్కరు సుమారు రూ.కోటికి పైగా వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో వాటిని అర్ధాంతరంగా వదిలేసి బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విఠల్‌నగర్‌లో చేపట్టిన సమీకృత మార్కెట్ భవన నిర్మాణమే పూర్తికాకపోగా మరో రూ.4.5 కోట్ల వ్యయంతో గోదావరిఖని ఎన్టీఆర్‌నగర్‌లో మరో సమీకృత మార్కెట్ భవన నిర్మాణం చేపట్టారు. పునాదుల వరకు నిర్మించగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులను వదిలేశాడు. దీంతో ఇనుప రాడ్లు తుప్పు పట్టిపోతున్నాయి. రామగుండంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎన్టీఆర్ నగర్‌లో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి పలుమార్లు టెండర్లు నిర్వహించినా గుత్తేదార్లు ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఓ గుత్తేదారు పనులు చేపట్టినప్పటికీ మధ్యంతరంగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులను వదిలేశారు. నగరపాలిక సీనియర్ సిటిజన్ పార్కు స్థలంలో రూ.8 కోట్ల అంచనాలతో బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం మొదలు పెట్టారు. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కేంద్రంలో ఈ భవన నిర్మాణం పూర్తయితే వ్యాపారులతో పాటు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందనే రామగుండం నగరపాలక ప్రజల ఆశలు నెరవేరలేదు.



ఆరేళ్ల క్రితం పనులు మొదలుకాగా సుమారు రూ.2 కోట్ల వరకు వెచ్చించి గుత్తేదారు పనులు చేపట్టినప్పటికీ చేసిన పనులకు మధ్యంతర బిల్లులు చెల్లించలేదు. దీంతో సంబంధిత గుత్తేదారు నిర్మాణం పనులను వదిలేశారు.నిరుద్యోగ యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలకు సిద్ధం చేసే లక్ష్యంతో రూ.5 కోట్ల వ్యయంతో మల్యాపూర్ శివారులో చేపట్టిన అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పునాదులతో పాటు కొంత మేరకు పిల్లర్ల నిర్మాణం జరిగినప్పటికీ బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారు నిర్మాణం పనులను వదిలేశారు. నిర్మాణం పూర్తికాకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారు.

విఠల్‌నగర్‌లో సమీకృత మార్కెట్ భవన నిర్మాణం రెండు దశాబ్దాల కల. అప్పట్లోనే స్థల పరిశీలన చేసిన జిల్లా పాలనాధికారి అంచనాలు సిద్ధం చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా పనులు మొదలు పెట్టలేదు. ఎట్టకేలకు రామగుండం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులతో విఠల్‌నగర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్, మరో రూ.కోటి వ్యయంతో సామాజిక భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. సుమారు ఆరేళ్ల క్రితం నిర్మాణం పనులు మొదలైనా నిధుల కొరతతో పాటు కరోనా ప్రభావంతో పనులను ఆపేశారు. ఆ తర్వాత నత్తనడకన పనులు సాగుతున్నాయి.

విడుదలలో జాప్యంతోనే.. –అనిల్‌కుమార్, మేయర్‌సీఎంఈ (గ్రాంట్లు), పట్టణ ప్రగతి నిధుల విడుదలలో జాప్యంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ విషయమై అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఒక్కో గుత్తేదారుకు రూ.కోటికి పైగా బిల్లులు రావాల్సి ఉంది. టెండరు నాటి కంటే ఇప్పుడు సామగ్రి ధరలు పెరిగాయి. వాటికి అనుగుణంగా నిర్ణయిస్తేనే గుత్తేదార్లు పనులు చేపట్టే అవకాశముంది.

# నిండని నీటి వనరులు

పాలమూరు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెలతో పోలిస్తే భూగర్భ జలాలు స్వల్పంగా పెరిగినా పూర్తి స్థాయిలో నీటి వనరులు నిండలేదు. గత నెలలో భారీ వర్షాలు పెద్దగా లేకపోవడంతో నీరు భూమిలోకి ఇంకలేదు. ఫలితంగా భూగర్భ జలాలు మెరుగుపడలేదు. ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 643.2 మి.మీ.లు. జులై నెల వరకు 226.8 మి.మీ.ల వర్షం కురవాలి. జులై చివరి నాటికి 330.5 మి.మీ.ల వర్షం నమోదు అయింది. సాధారణ వర్షపాతం కంటే 45.7 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. గతేడాది జులైతో పోల్చుకుంటే ఈసారి నమోదైనది తక్కువ వర్షపాతవే. పలు జిల్లాల్లో నీటి మట్టాలు చాలా లోతుకు వెళ్లటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వనపర్తి జిల్లాలోనే కాస్త మెరుగు : భూఉపరితలం నుంచి 20 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్తే ఆ ప్రాంతంలో నీటి కష్టాలు తప్పవు. అలాంటివి ఉమ్మడి జిల్లాలో చాలానే ఉన్నాయి. హన్వాడ మండలంలో 28.61 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇదే అతి ఎక్కువ లోతులోకి జలాలు వెళ్లిన ప్రాంతం. గండీడ్ మండలంలో 22.87, నవాబ్‌పేట మండలంలో 20.82, మిడ్జిల్ మండలంలో 20.44 మీటర్లలో లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అమ్రాబాద్ మండలంలో 25.50, పదరలో 25.40, నాగర్‌కర్నూల్‌లో 24.78, కల్వకుర్తిలో 23.76, ఉప్పునుంతలలో 21.41 మీటర్ల లోతులోకి జలాలు వెళ్లాయి. ధరూర్ మండలంలో 27.19, ఉండవల్లిలో 20.97 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదు అయ్యాయి. ధన్వాడ మండలంలో 22.75, గుండ్‌మాల్‌లో 20.40 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో ఒక్క మండలం కూడా 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులోకి భూగర్భ జలాలు వెళ్లలేదు. మదనాపురం మండల కేంద్రంలోనే 14.70 మీటర్ల లోతులో జలాలు ఉండటం విశేషం. గతేడాదితో పోలిస్తే మాత్రం ఇక్కడి నీటిమట్టాలు తక్కువే.

వర్షాలు కురిసే అవకాశం– రమాదేవి, భూగర్భ జల వనరుల శాఖ జిల్లా అధికారి, మహబూబ్‌నగర్

ప్రస్తుతం వర్షాలు బాగానే కురుస్తున్నాయి. గత నెలలో పది రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. రాబోయే రోజుల్లోనూ వర్షాలు కురిస్తే గతేడాదిలో నమోదైన నీటిమట్టాలను అధిగమించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే తీవ్ర నీటి ఎద్దడి ఉన్న కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఇంకా పెరగాల్సిన అవసరముంది.

# మాయగాళ్ల ఎత్తులు.. అమాయకులకు చిక్కులు



హైదరాబాద్ : తెలిసిన వ్యక్తులు.. తెలియని బ్యాంకు ఖాతాల నుంచి నగదు స్వీకరిస్తున్నారా.. అయితే ఆలోచించాల్సిందే. అవతలి వ్యక్తులకు ఎటువంటి నేరచరిత్ర లేకపోయినా.. వారి ఖాతాల్లోకి చేరిన నగదు లావాదేవీలు సైబర్ ముఠాలతో సంబంధాలున్నట్టు పోలీసులు గుర్తిస్తే అంతే సంగతులు. మీ ఖాతాలో జమ చేసింది కొద్దిమొత్తమే.. అయినా మీ లావాదేవీలన్నీ స్తంభించిపోతాయి. కొన్ని దేశాల్లో మిత్రులు, బంధువులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. జనం నుంచి కొట్టేసిన నగదును నేరస్థులు అద్దెకు తీసుకున్న బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

**వీరి బాధ తీరేదెలా?**

చందానగర్‌లో దుకాణంలో వస్తువు కొనుగోలు చేసిన ఒక వ్యక్తి యూపీఐ ద్వారా రూ.100 చెల్లించాడు. రెండ్రోజుల తరువాత దిల్లీ పోలీసులు సదరు వ్యాపారి బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఆరా తీస్తే బిల్లు చెల్లించిన వ్యక్తి ఖాతాలోకి చేరిన సొమ్ముతో సైబర్ నేరస్థులకు సంబంధాలుండటమేనని తేలింది. తనకేం తెలియదని వ్యాపారి వాదించినా.. ఏదైనా ఉంటే దిల్లీ వచ్చి చెప్పమంటూ తేల్చిచెప్పారు.

జూబ్లీహిల్స్ వ్యాపారికి అదిలాబాద్‌లో స్నేహితుడికి అత్యవసరమంటూ రూ.1.50 లక్షలు అతని ఖాతాకు బదిలీ చేశాడు. కొద్దిరోజుల తరువాత తిరిగి అతడు ఆ నగదును ఇతడి ఖాతాలో జమచేశాడు. ఇటీవల ఆ వ్యాపారి తన రెండు బ్యాంకు ఖాతాల్లో నగదు లావాదేవీ నిర్వహించారు. అతడి ఆ రెండు ఖాతాలను సైబర్ పోలీసులు సీజ్ చేశారు. అతను లావాదేవీ జరిపిన సొమ్ము సైబర్ మోసానికి సంబంధించిందని, ముంబయిలో కేసు నమోదైందన్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో కోళ్ల వ్యాపారం చేసే తన ఖాతా నిలిచిపోయిందంటూ బోరుమన్నాడు.

అమీర్‌పేటలోని హోటల్‌లో ఓ వ్యక్తి అల్పాహారం తిని ఫోన్‌పేతో చెల్లించాడు. మరుసటిరోజు రూ.3.50 లక్షల నిల్వలున్న ఖాతాను సీజ్ చేసినట్లు సందేశం వచ్చింది.

ప్రవాస వైద్యురాలు జూబ్లీహిల్స్‌లోని తన ఇంటిని రూ.12.5 కోట్లకు విక్రయించారు. కొన్న వ్యక్తి ఆమె ఖాతాకు సొమ్ము బదిలీ చేశాడు. అయితే ఆ సొమ్ముతో సైబర్ నేరాలకు సంబంధం ఉందంటూ లావాదేవీలను నిలిపివేశారు. దీంతో రెండ్రోజుల క్రితం ఆమె అమెరికా నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఆ ఖాతాలతోనే సమస్యలు**

చైనా, దుబాయ్ కేంద్రంగా సైబర్ ముఠాలు మోసాలకు పాల్పడుతున్నాయి. పెట్టుబడులు, ఉద్యోగాలు, ఫెడెక్స్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వాటితో కొట్టేసిన సొమ్ము జమకు భారతీయ ఖాతాలను వినియోగిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దుబాయ్, సింగపూర్, థాయ్‌లాండ్, సింగపూర్, కంబోడియా చేరుతున్నారు. అక్కడ నుంచి కుటుంబసభ్యులకు డబ్బు పంపేందుకు అధీకృత సంస్థలున్నాయి. వాటి ద్వారా పంపితే పన్నులు, కమీషన్ ఎక్కువగా ఉంటాయని ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు.

దర్యాప్తు అధికారులను సంప్రదించండి

ఫిర్యాదు అందగానే సైబర్ నేరాలు, హవాలా లావాదేవీలతో సంబంధం ఉన్న ఖాతాలను మాత్రమే స్తంభింపచేస్తామని సైబర్‌క్రైమ్ పోలీసులంటున్నారు. బాధితులు పోగొట్టుకున్న సొమ్ము వరకే నిలిపేస్తామని, మిగిలిన లావాదేవీలు నిర్వహించుకోవచ్చున్నారు.

# హైడ్రాతో వణుకు.. ప్రజాప్రతినిధుల కినుక



హైదరాబాద్ :నగరంలో ఖాళీ ప్రభుత్వ జాగా కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. చెరువులను సైతం వదలడం లేదు. రాత్రికిరాత్రే నిర్మాణాలు చేస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్థే హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ). ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, చెరువులను రక్షించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి అండగా ఉండటం దీని ప్రధాన లక్ష్యాలు. ఇది కబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట ఆక్రమణలను కూల్చేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధుల నుంచి మాత్రం అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రజాప్రతినిధులో అసంతృప్తి.. హైడ్రా ఏర్పాటుకాగానే రంగంలోకి దిగింది. అనేక చెరువుల్లో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చింది. ఈ సంస్థను రద్దు చేయాలని కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, ఒకరిద్దరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. నగరంలో కబ్జా కోరల్లో ఉన్న చెరువులు, పార్కులు రక్షణ చర్యలు చేటపట్టాలంటే హైడ్రా గణనీయమైన పాత్ర పోషించాల్సిందే. అలాంటి సంస్థకు తోడ్పాటు ఇవ్వడంలో సీఎం రేవంత్‌రెడ్డి బలమైన ఆదేశాలు ఇస్తారా.. లేనిపక్షంలో ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి తూతూమంత్రంగా మార్చేస్తారా అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే అనేకమంది ప్రజాప్రతినిధులు హైడ్రా తీరును సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నిర్ణయంపైనే దాని భవిష్యత్తు ఆధారపడింది.

సుమారు 100 ఎకరాలు స్వాధీనం

సుమారు నెల కిందట హైడ్రా ఏర్పడింది. దీనికి కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సంస్థ కోసం దాదాపు 3 వేల మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని నియమించడానికి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే దాదాపు 20 చెరువుల్లో ఆక్రమణలు తొలగించింది. సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది.

జూబ్లీహిల్స్‌లోని నందగిరి హిల్స్‌కు సంబంధించిన 2 వేల గజాల పార్కు స్థలంలో గురుబ్రహ్మ నగర్ వాసులు గుడిసెలు వేసుకున్నారు. వీటిని హైడ్రా తొలగించి ప్రహరీ నిర్మించింది. దీంతో ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు మరికొందరు ప్రహరీని కూల్చడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన కమిషనర్ రంగనాథ్‌పై విరుచుకుపడ్డారు. సీఎంకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

పాతబస్తీలోని శాస్త్రీపురం బంరుక్‌నుద్దౌల చెరువులో ఆక్రమణలను కూల్చేశారు. ఈ సమయంలో బహుదూర్‌పుర ఎమ్మెల్యే మొహ్మద్ ముబీన్‌తో పాటు మరికొందరు అడ్డుకోవడానికి యత్నించగా.. అరెస్టు చేయించి మరీ పని కానిచ్చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులైతే ఏకంగా హైడ్రాను రద్దు చేయాలని మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇవ్వడం చర్చనీయాంశమైంది.

ఆక్రమణలపై కొరడా

బాచుపల్లి మండల పరిధి ప్రగతినగర్ పరిధిలోని 134 సర్వే నంబరులో 3.03 ఎకరాల్లో విస్తరించిన ఎర్రకుంటలో నిర్మిస్తున్న మూడు బహుళ అంతస్తుల భవనాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. గురువారం తెల్లవారుజామున మొదలైన కూల్చివేతలు రాత్రి 11 వరకు సాగాయి. 'మ్యాప్స్ ఇన్‌ఫ్రా' అనే నిర్మాణ సంస్థ 360 చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున మూడు వేటర్వేరు బ్లాకుల భవనాలను నిర్మించడానికి హెచ్‌ఎండీఏ నుంచి గతంలోనే అనుమతి పొందింది. అవి ఎర్రకుంటకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లోకి వస్తాయంటూ, దొడ్డిదారిన అనుమతులు పొందారని, కుంటను సర్వే చేయాలంటూ మొదటి నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీనిపై భాజపా నేత ఆకుల సతీష్ ఆధ్వర్యంలో అనేకసార్లు అధికారుల తీరును నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఫిర్యాదులు మరింత ఎక్కువ కావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం ఎర్రకుంటను సందర్శించారు. ఆయన వెళ్లిన కొన్ని గంటల్లోనే అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భారీ క్రేన్ల సాయంతో కూల్చివేతలు మొదలుపెట్టారు.

శభాష్ రంగనాథ్ – ఎక్స్‌లో.. ఆకునూరి మురళీ, మాజీ ఐఏఎస్

శభాష్ రంగనాథ్ మంచి పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు అడ్డగోలంగా ప్రభుత్వ, చెరువు శిఖం భూములు ఆక్రమిస్తున్నారు. సీఎం హైడ్రాను మరింత బలోపేతం చేసి రాష్ట్రమంతా విస్తరించాలి. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి పూర్తి సహకారమివ్వాలి. చెరువులు, లక్షల కోట్ల భూములను కాపాడి భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి.

# సార్వత్రిక విద్య ప్రవేశాలకు వేళాయే..

కరీంనగర్ : ప్రతికూల పరిస్థితుల కారణంగా కొందరు చదువును మధ్యలోనే మానేస్తున్నారు. ఇలాంటి వారు సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) ద్వారా వయసుతో సంబంధం లేకుండా సెలవు దినాల్లో చదువుతూ పదోతరగతి, ఇంటర్ విద్యార్హతలను పెంచుకోవచ్చు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.


**53 అధ్యయన కేంద్రాలు..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలున్నాయి. ఏటా దాదాపు 4 వేల మంది ఇంటర్, ఎస్సెస్సీ విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసే ఈ కేంద్రాల్లో ఉపాధ్యాయులే సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. ఇందులో ప్రవేశాలు పొందిన వారికి సెలవు రోజుల్లో పాఠాలను బోధిస్తారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందిస్తారు.

**రుసుం చెల్లింపు ఇలా..**

అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు రుసుం చెల్లించాలి. అపరాధ రుసుంతో చెల్లింపునకు అక్టోబరు 3 గడువు. రిజిస్ట్రేషన్ రుసుంతో కలిపి ఎస్సెస్సీకి జనరల్ కేటగిరీ వారు రూ.1,550, అన్ని వర్గాల మహిళలు రూ.1,150 చెల్లించాలి. ఇంటర్‌కు జనరల్ కేటగిరీ వారు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు రూ.1,500లు చెల్లించాలి. మీసేవాలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు అదనం. ఆసక్తి గల అభ్యర్థులు సమీప అధ్యయన కేంద్రాలు లేదా ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్‌ను సంప్రదించాలి. ఎస్సెస్సీలో ప్రవేశాలకు 14 ఏళ్లు నిండి పదో తరగతి విద్యకు దూరమైన వారు.. ఇంటర్‌కు 15 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలి.

**దళారులతో జాగ్రత్త**



ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందే అభ్యర్థులకు రుసుంల చెల్లింపు విషయంలో అప్రమత్తత అవసరం. ప్రభుత్వం నిర్ణయించిన ప్రవేశ, పరీక్షల రుసుంలను మాత్రమే చెల్లించేలా వివరాలను తెలుసుకోవాలి. గ్యారంటీ పాస్ పేరుతో దళారులు కొందరు ప్రవేశాలను కల్పించే ప్రయత్నాలకు లొంగొద్దు. కొన్నిచోట్ల రుసుంలను ఎక్కువగా వసూలు చేయడం, పాస్ గ్యారంటీ పేరుతో అందినంత డబ్బులు తీసుకోవడం వంటివి జరిగినట్లు విమర్శలున్నాయి.

**విద్యార్హతలకు ఉపయోగించుకోవాలి**

– సి.హెచ్.నాగేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

అర్ధాంతరంగా చదువు మానేసిన వారికి విద్యార్హతలు పెంచుకునేందుకు ఓపెన్ స్కూల్ ప్రవేశాలు మంచి అవకాశం. ఇక్కడి పది, ఇంటర్ ధ్రువపత్రాలు రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానం. ఏమైనా సందేహాలు ఉంటే ఫోన్ నంబరు 83092 12661లో సంప్రదించొచ్చు.

# రేకులకుంట చెరువు మాయం

మహబూబ్‌నగర్ : నారాయణపేట జిల్లా కోస్గి మండలం బొలవానిపల్లిలో వివిధ సర్వే నంబర్లలో 19.35 ఎకరాల్లో రేకులకుంట చెరువుకు 1991లో నీటిపారుదల శాఖ అధికారులు భూసేకరణ చేశారు. ఇందులో 14.28 ఎకరాలను ఆ శాఖ పట్టాదారుల నుంచి సేకరించింది. భూసేకరణలో భాగంగా రైతులకు పరిహారం చెల్లించారు. ఇదే ప్రాంతంలో మరో 5.07 ఎకరాల్లో ప్రభుత్వ స్థలం కూడా ఉంది. మొత్తం కలిపి 19.35 ఎకరాల్లో రేకులకుంట చెరువును వివిధ దశల్లో అభివృద్ధి చేశారు. ఈ చెరువుకు అప్పట్లో భారీ కట్టను కూడా నిర్మించారు. వర్షాలు కురిస్తే సమీపంలోని గుట్టల నుంచి ఈ చెరువులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. దీనికి ప్రత్యేకంగా పాటు కాలువలు ఉన్నాయి. తర్వాత ఈ చెరువును పట్టించుకోపోవడంతో స్థానికులు కొందరు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అసలిక్కడ చెరువు ఉందన్న ఆనవాళ్లు కూడా లేవు. పాటు కాలువల ఆకృతి మారిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. కోస్గి నుంచి దౌల్తాబాద్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో





అక్రమార్కుల కళ్లు ఈ భూములపై పడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఈ చెరువు స్థలాన్ని కొనుగోలు చేసేందుకు చూసి వెళ్లారు. ధర కూడా మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చెరువు కట్టను పూర్తిగా కనుమరుగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ కట్టను కొంత భాగం తవ్వారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు మౌనంగానే ఉన్నారు. ఈ చెరువు పరిరక్షణపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అధికారులపై ఒత్తిడి..

ఇటీవల ఈ చెరువును నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో 19.35 ఎకరాల్లో ఉన్న చెరువు కనిపించకపోవడంతో పూర్తి స్థాయిలో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించగా అందులో ఈ చెరువు ఉందని తేలింది. ఈ స్థలాన్ని పట్టాదారుల నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లోనూ ఉంది. ఈ వ్యవహారం రెవెన్యూ శాఖ వద్దకు వెళ్లింది. ఇవన్నీ తెలుసుకున్న పార్టీ నేతలు, దళారులు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇక్కడ చెరువు ఉన్న విషయాన్ని బయటకు రాకుండా చూడాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం సర్వే చేయడానికి కూడా రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చెరువు పూర్తిగా ధ్వంసమైంది. పాటు కాలువలు సరిగ్గా కనిపించడం లేదు. ఈ చెరువు స్థలాన్ని సర్వే చేసి సరిహద్దులు గుర్తించి ఆయకట్టు అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చెరువు పరిరక్షణపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై నీటిపారుదలశాఖ డీఈ ఆనంద్‌కిశోర్‌తో మాట్లాడుతూ రికార్డుల్లో ఇక్కడ చెరువు ఉన్న విషయం వాస్తవమేనన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించామని తమకు సరిహద్దులు చూపాలని రెవెన్యూ శాఖకు లేఖ రాసినట్లు వెల్లడించారు. చెరువు స్థలాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. కోస్గి తహసీల్దారు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రేకులకుంట ఆక్రమణకు గురైందని నీటి పారుదల శాఖ అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని, దీనికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఉపాధ్యాయ శిక్షణకు ఆదరణ

ఖమ్మం : పీహెచ్‌డీతో పాటు నెట్ అర్హత, ఎంఫిల్, ఎంఈడీ, ఎంటెక్, బీటెక్ తదితర కోర్సులు చదివిన ఉన్నత విద్యావంతులు కేవలం ఇంటర్ అర్హతతో చదివే ఉపాధ్యాయ శిక్షణ కోర్సుకు దరఖాస్తు చేస్తున్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అర్హత పరీక్షకు పోటీ పడుతున్నారు. జిల్లా విద్యా, శిక్షణ సంస్థ(డైట్) కళాశాలల్లో 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్' ఉపాధ్యాయ శిక్షణకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దశాబ్ద కాలం నుంచి కళాశాలల్లో సీట్లు భర్తీకాని పరిస్థితి నెలకొంది. కానీ ఇప్పుడు ప్రవేశాల కోసం డిమాండ్ ఏర్పడింది. పరిస్థితి చూస్తే చాలా సంవత్సరాల తర్వాత 'డైట్' కళాశాలలకు మహర్దశ పట్టనుంది. జాబ్ క్యాలెండర్ ప్రకటనతో... ప్రధానంగా ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ప్రకటించింది. త్వరలో మరో డీఎస్సీ నిర్వహిస్తామని చెబుతోంది. ఇదివరకే జాబ్ క్యాలెండర్ ప్రకటించింది. ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కేవలం



డీఐఈఎల్ఈడీ కోర్సు చేసినవారు మాత్రమే అర్హులని ప్రకటించటంతో ఓ భరోసా ఏర్పడింది. గత డీఎస్సీ వరకు ఎస్‌జీటీ పోస్టులు 50 శాతం బీఈడీ చేసిన వారికి కూడా కేటాయించారు. ఈసారి పూర్తిగా రద్దు చేయటంతో ఈ కోర్సుకు ఆదరణ పెరిగింది. ఎంఈడీ చేసి ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసేవారు సైతం పోటీ పడుతున్నారు.

ఇంటర్ చదివిన విద్యార్థులు డైట్ కళాశాలల్లో ఉపాధ్యాయ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జూన్ 6న నోటిఫికేషన్ విడుదల చేశారు. జులై 10న ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహించారు. ఈనెల 1 నుంచి 7 వరకు కళాశాలల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ఏడాది ఉపాధ్యాయ శిక్షణకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అనేక మంది అర్హత సాధించారు. ఈసారి కళాశాలలో ఉన్న సీట్లు మొత్తం భర్తీ అయ్యే అవకాశం ఉంది. భవిష్యత్తులో డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. సామినేని సత్యనారాయణ, ప్రిన్సిపల్, డైట్ కళాశాల, ఖమ్మం

# బూడిద చుట్టూ రాజకీయ చిచ్చు!

కరీంనగర్ : బూడిద రవాణా వ్యవహారం రాజకీయ దుమారం లేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల పరస్పర విమర్శలకు కేంద్రంగా మారింది. రామగుండం ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వెలువడే బూడిద రవాణాకు సంబంధించి కాంగ్రెస్, భారాస నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ పెరుగుతోంది. రవాణాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఓ పార్టీ ఆరోపిస్తుండగా.. రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని మరో పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు కొన్నేళ్లుగా బూడిద తరలిస్తున్నారు. 'అక్రమ రవాణాతో పాటు ప్రతి రోజూ రూ.లక్షల్లో అవినీతి జరుగుతోందని, ఇందుకు అధికార పార్టీ ముఖ్య నేత సహకారముంద'ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో చర్చకు దారి తీశాయి. తాను స్వయంగా కొన్ని లారీలను పట్టించినప్పటికీ రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొంటుండగా, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రణవ్ ఖండించారు. కౌశిక్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, అధికారులు కేసులు నమోదు చేశారనే విషయాన్ని ఆధారాలతో చూపించారు. బూడిద తరలింపు వ్యవహారంలో తమ పార్టీకి సంబంధం లేదని చెప్పడానికి తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

పక్కా పర్యవేక్షణతోనే అడ్డుకట్ట

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే బూడిద తరలింపు వ్యవహారంపై రవాణా శాఖ అధికారులు పక్కాగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉ



ంది. తరలింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు రోజూవారీగా ఎన్ని వాహనాలు వెళ్తున్నాయనే విషయమై వివరాలు పక్కాగా ఉంటేనే బూడిద రవాణా ప్రక్రియ పారదర్శకంగా సాగే వీలుంది. అంతేకాకుండా వాహనాలను మార్గమధ్యంలో తనిఖీలు చేయడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశముంది. మోతాదు కంటే అధిక పరిమాణంలో సరఫరా చేస్తుండటంతో లారీల వెనుక ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. రామగుండం నుంచి రాజీవ్ రహదారి సహా హుజూరాబాద్, వరంగల్ మార్గంలో నిత్యం వివిధ జిల్లాలకు పెద్ద ఎత్తున బూడిద రవాణా జరుగుతోంది. రాత్రింబవళ్లు వందలాది వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. లారీలతో పలు చోట్ల రహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా బూడిద రవాణా ప్రక్రియ నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఇటీవలి కాలంలో 70 వరకు అనుమతి లేని బూడిద లారీలను పట్టుకొని జరిమానా విధించామని చెప్పారు. బూడిద తరలింపులో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

రామగుండంలోని బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ నుంచి వెలువడే తడి, పొడి బూడిదను అంతర్గాం మండలం కుందనపల్లిలోని ప్రత్యేక చెరువులో నింపుతారు. 500 ఎకరాల్లో ఉన్న ఈ చెరువులో ప్రతి రోజూ టన్నుల కొద్దీ బూడిదను డంప్ చేస్తారు. ఇక్కడి బూడిదను రహదారుల నిర్మాణానికి, ఇటుకల తయారీకి వినియోగిస్తారు. ఎప్పటికప్పుడు తరలించేందుకు టెండర్లు పిలుస్తారు. కాగా లారీలో గరిష్ఠంగా 40 టన్నుల బూడిదను తీసుకెళ్లాల్సి ఉండగా, పక్కలకు చెక్కలు కట్టి అదనంగా మరో 15–20 టన్నులు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే రవాణా చేసే లారీకి తప్పనిసరిగా నంబరు ఉండాలి. కానీ నంబరు ప్లేటు లేని వాహనాల్లో యథేచ్ఛగా తరలిస్తూ కొందరు అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బూడిద రవాణా జరుగుతోందని, ఇందుకు లెక్కా పత్రం ఉండటం లేదనే విమర్శలున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని పలు ఇటుక బట్టీలకు, క్వారీల్లో గుంతలు పూడ్చేందుకు కూడా బూడిదను వినియోగిస్తున్న దాఖలాలున్నాయి. అలాగే ఎక్కడ పడితే అక్కడ బూడిద నిల్వలు కనిపిస్తుండగా, ఇది చెరువు నుంచి అక్రమంగా తరలించినదేనంటూ పలువురు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి.

## శిథిల భవనంతో భయం

మంథని : 28 సంవత్సరాల క్రితం నిర్మించిన మంథని సామాజిక వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకొంది. స్లాబ్ పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో రోగులు ఆసుపత్రిలో ఉండటానికి జంకుతున్నారు. ఆ స్థలంలో నూతన భవన నిర్మాణానికి 2018లో రూ.2.76 కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. 2019లో టెండరు ప్రకియ సైతం పూర్తయింది. ప్రస్తుతం నడుస్తున్న ఆసుపత్రి మరో చోటుకి తరలించడానికి అనువైన భవనం అందుబాటులో లేక తరలించలేదు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఆసుపత్రిని తరలించేందుకు అనువైన భవనం అందుబాటులోకి లేకపోవడంతో నూతన భవనాల నిర్మాణ పనులను 2022లో డీఎంఎఫ్‌టీ కమిటీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మంథనిలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. నూతన భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంథనిలో 50 పడకల ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కానీ ఆరు నెలలు గడిచినా ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఈ విషయమై జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి రమాకాంత్‌ను వివరణ కోరగా మంథనిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

# సర్కారు జాగా దర్జాగా కబ్జా.. ఇంటి నంబర్లతో వెయ్యి గజాలకు దరఖాస్తు



హైదరాబాద్ : గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లో కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలతో మాయాజాలం ప్రదర్శించి వెయ్యిగజాల సర్కారు స్థలాన్ని కబ్జా చేశారు. ఖాజాగూడలోని దిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా నివాసముంటున్న వీరు.. వెయ్యి గజాల స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ఏళ్ల తరబడి ఆ స్థలంలో ఉంటున్నామంటూ తాము ఉంటున్న ఇంటినంబర్లతోనే జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించుకున్నారు. అనంతరం భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకుని భవనాలు నిర్మిస్తున్నారు. ఇదంతా కేవలం ఆరేళ్ల వ్యవధిలోనే పూర్తిచేశారు. తాముంటున్న ఇళ్లపై బ్యాంకులో రుణాలు కూడా తీసుకున్నారు. క్రమబద్ధీకరించేటప్పుడు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు పరిశీలించకపోవడం, జీహెచ్‌ఎంసీ అధికారులు వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా అనుమతులిచ్చేశారు.

జీహెచ్‌ఎంసీ అధికారులూ ఇలా చేశారు..

ఖాజాగూడలో రహదారి విస్తరణకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఐదేళ్ల క్రితం స్థల సేకరణ చేపట్టారు. 1242 గజాల స్థలంలో 204 గజాలను తీసుకున్నారు. నష్టపరిహారంగా టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్)ను అందజేశారు. తప్పుడు పత్రాలతో కబ్జాచేసుకున్న 1002 గజాల స్థలం ఉండగా... రెండేళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో మరో 234గజాల స్థలాన్ని కబ్జా చేసి మొత్తం 1236.5గజాల స్థలాన్ని ఓ స్థిరాస్తి సంస్థతో అభివృద్ధికి ఒప్పందం కుదుర్చుకున్నారు.

గతేడాది ఏప్రిల్‌లో ఆ స్థలంలో రెండు సెల్లార్‌లు, ఒకగ్రౌండ్ ఫ్లోర్ సహా నాలుగు అంతస్థుల భవనం నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు పదిశాతం స్థలాన్ని మార్టిగేజ్ చేసుకుని నిర్మాణానికి అనుమతులిచ్చారు.

అలా కన్నేశారు... ఇలా ఆక్రమించుకున్నారు..

ఖాజాగూడ సర్వే నం.28లో దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం 1982లో కోళ్లఫారాలు ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కొక్కరికీ 242 గజాల చొప్పున స్థలాలను కేటాయించింది. వీటిని విక్రయించకూడదు.. బదిలీ చేయకూడదన్న నిబంధనలతో ప్రభుత్వం కేటాయించగా... కొన్నేళ్లయ్యాక చాలామంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. ఇందులో రెండు ఇళ్ల యజమానుల వారసులు నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు విక్రయించి సేల్‌డీడ్ చేశారు. వాటిని 2010లో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. లబ్ధిదారుల నుంచి ఇళ్లను కొనుగోలు చేసిన వ్యక్తులు 2015లో పుప్పాలగూడలోని ఓ బ్యాంకులో తనఖా ఉంచి రూ.1.08కోట్ల రుణాన్ని తీసుకున్నారు.

రికార్డులు పరిశీలిస్తాం: కె.వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రాజేంద్రనగర్

ఖాళీ స్థలాన్ని వేరే నిర్మాణానికి జతచేస్తే నిబంధల ప్రకారం జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించకూడదు. ఆరేళ్ల క్రితం క్రమబద్ధీకరించారంటే రికార్డులు పరిశీలిస్తాం. అక్రమాలు జరిగాయని తేలితే.. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

# గుప్పిట గులాబీ




హైదరాబాద్ : రాజధానిలో కాంగ్రెస్ బలం పెంచుకోవడానికి వేసిన వ్యూహంలో భారాస ఎమ్మెల్యేలు చిక్కుకుంటున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మొదలైన మార్పు కొనసాగింపేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆకర్ష్ ఫలితమిస్తోంది. హైదరాబాద్ సమీప జిల్లాల్లో భారాసకు చెందిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఆ పార్టీ పెద్దఎత్తున దృష్టి సారించింది. కొంతమంది ఎమ్మెల్యేలు తక్షణం పార్టీలోకి చేరడానికి సిద్ధమవుతుండగా.. మరికొద్ది మంది కొంత కాలం వేచి చూసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నారు. చేవెళ్ల సీనియర్ భారాస ఎమ్మెల్యే యాదయ్య దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు. వచ్చే నెల రోజుల్లో మరో అయిదుగురుని పార్టీలో చేర్చుకోవడంపై కాంగ్రెస్ అగ్రనేతలు సమాలోచనలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అతి తక్కువ స్థానాలను సాధించింది. ఈ జిల్లాల్లో 29 స్థానాలుంటే కాంగ్రెస్ మూడు స్థానాలకే పరిమితమైంది. భారాస 18 స్థానాల్లో, ఎంఐఎం ఏడు, భాజపా ఒక్క స్థానంలో గెలుపొందాయి.

పట్టు పెంచుకోవడానికి..: హైదరాబాద్ నగర పరిధిలో పట్టు పెంచుకోవడానికే భారాస ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకోవాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో భారాస ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కావడం లేదు. అధికారులు మాట వినడం లేదు. అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం ఉండటం లేదని భావిస్తున్న వారిని మెల్లగా దారిలోకి తెచ్చుకోవడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వాళ్లకు నియోజకవర్గంలో మళ్లీ పెత్తనం కొనసాగించుకోవడానికి అధికారం కావాలనే చాలా మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వచ్చారు. పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. చివరి నిమిషంలో ఆయన వెనకడుగు వేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జానారెడ్డిని కలిసి వచ్చారు. ఆయనకాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశం ఉందని అంటున్నా... దీన్ని ఆయన ఖండిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మంతనాలు జరుగుతున్నాయని... ఒకరిద్దరు తప్ప నగరానికి చెందిన భారాస ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లో చేరతారని దానం పేర్కొంటున్నారు.

# వనరుల పరిరక్షణకు కార్యాచరణ



పెద్దపల్లి : చెరువులు, నీటి కుంటలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నాయి. మురుగు, రసాయనాలతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. గతంలో నీటి వనరుగా ఉపయోగపడిన చెరువులు ప్రస్తుతం చాలా చోట్ల మురుగు నిల్వకు కేంద్రంగా మారాయి. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక శాఖకు బాధ్యత అప్పగించింది. తటాకాల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థలు, వివిధ రంగాల నిపుణులు, రాష్ట్రంలోని కమిషనర్లతో పురపాలక శాఖ సమీక్షలు నిర్వహించింది. పురపాలక, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన ఇంజినీర్లు, అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఆక్రమణలో 30 శాతం వనరులు

కేంద్ర జలశక్తి శాఖ గతేడాది నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 శాతం చెరువులు, 40 శాతం కుంటలు ఆక్రమణలకు గురైనట్లు తేలింది. కరీంనగర్, రామగుండం, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం కబ్జాలు జరిగినట్లు వెల్లడించింది. ఓవైపు ఆక్రమణలతో చెరువులు కుచించుకుపోగా మరోవైపు మురుగును నేరుగా తటాకాల్లోకే మళ్లిస్తున్నారని నివేదికల్లో తేలింది. సర్వేలో ఇలాంటి చెరువులను గుర్తించి అవసరమైన చోట్ల మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పురపాలక అధికారులకు ఆదేశాలు అందాయి.

నెలాఖరులోగా పూర్తికి ఆదేశాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,283 చెరువులున్నాయి. అంతటా కలిసి 2 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టున్నా 1.27 లక్షల ఎకరాలకు, అది కూడా ఒక పంటకు మాత్రమే నీరందేది.

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద మొత్తం రూ.741.18 కోట్లతో 1,833 చెరువులను పునరుద్ధరించగా నీటి నిల్వ సామర్థ్యం 19.93 టీఎంసీలకు పెరిగింది.

అయితే కొన్ని చెరువులు కళ తప్పాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పశువులు, కోళ్ల వ్యర్థాలు, మురుగుతో కాలుష్య కాసారాలుగా మారాయి.

ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాల పరిధిలో ముందు నగర, పట్టణ ప్రాంతాల్లోని చెరువులను ఎంపిక చేసి ఐఐటీ, స్వచ్ఛంద సంస్థల నిపుణుల సమష్టి భాగస్వామ్యంతో సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని పురపాలిక కమిషనర్లకు బాధ్యత అప్పగించారు.

ప్రతి పట్టణంలో ఎన్ని చెరువులున్నాయి? వాటి గరిష్ఠ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) ఎంత? బఫర్ జోన్ ఎంత? ఆక్రమణలున్నాయా? ప్రస్తుత పరిస్థితులు ఏమిటి? చెరువుల్లోకి వ్యర్థ జలాలు, కాలుష్య కారకాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? తటాకాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర విషయాలపై సర్వే చేయాలని పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఈ విషయమై పెద్దపల్లి పురపాలక కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో మాట్లాడగా ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకొని కార్యాచరణ చేపట్టామన్నారు.

# కొండెక్కిన కూరగాయలు

ఖమ్మం : కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఖమ్మం నగరం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ములుగు, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాపారులు కూరగాయలు కొంటారు. ప్రస్తుతం ఖమ్మం రైతుబజార్లలోనే ఎక్కువ ధరలు పలుకుతుంటే మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారుల దగ్గర మరింత మండిపోతున్నాయి.

వేసవి ప్రభావం వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటం ధరలపై కొంత ప్రభావం పడింది. ఖమ్మం టోకు విపణికి సీజన్‌లో రోజుకు 800–900 క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 400– 500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. వీటిలో కొన్నింటిని ఏపీ, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

దుంప కూరలూ ఎక్కువే..

కిలో ఆలుగడ్డ రూ.40, చామగడ్డ రూ.46, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.36 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ఇవి.. కొద్దిగా పర్వాలేదు..

కిలో బెండ రూ.30, దొండ రూ.24, సొరకాయ రూ.30, వంకాయ రూ.18, దోస రూ.30, క్యాబేజి రూ.26.

చిక్కదు గోరుచిక్కుడు..

15 రోజుల క్రితం గోరుచిక్కుడు కిలో ధరలు రూ.26 నుంచి రూ.30 ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.58కి పెరగటంతో వినియోగదారులు కొనలేకపోతున్నారు.

ఠారెత్తిస్తున్న భగ్గుమంటున్న పచ్చిమిరప

నెల రోజులుగా పచ్చిమిరప ధరలు భగ్గుమంటున్నాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.58 ఉంటే.. ఇప్పుడు మళ్లీ కిలో ధర రూ.70 పలుకుతోంది. అయినా విపణిలో సరకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉంటున్నాయి.

టమాట..

కొద్దినెలల పాటు టమాట ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రైతుబజార్లలోనే కిలో రూ.64 వరకు పలుకుతోంది. బహిరంగ విపణిలో చిరు వ్యాపారులు రూ.75కు విక్రయిస్తున్నారు.

కాకరా.. మజాకా..

వారం క్రితం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్న కాకరకాయల ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ప్రస్తుతం పొట్టి రకం కిలో ధర రూ.66, పొడవు రకం రూ.70 వరకు పలుకుతోంది.

కొనలేం.. క్యాప్సికం

క్యాప్సికం కిలో ధర రూ.74 వరకు ఉంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వరకు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వామ్మో బీర

బీరకాయల ధర కిలో రూ.80 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వీటి ధరలు ఇంతగా ఎన్నడూ పెరగలేదని వాపోతున్నారు. పక్షం రోజుల వరకు కిలో రూ.30లోపు ఉన్న ధరలు విపరీతంగా పెరిగాయి. సరకు సైతం తక్కువగా ఉంది.

ఆకుకూరలూ పిరం..

కొద్దిరోజుల వరకు రూ.10కి 2 కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించారు. ప్రస్తుతం రూ.20కి 2 లేదా 3 కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.70కి చేరింది. గతంలో రోజుకు 60–70 కట్టలు విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు 10– 20 మాత్రమే తెస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో పాడైపోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

## సీతా రామా ..ఇక వడివడిగా ..!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో తొలి అడుగు పడినా.. ఇప్పటికీ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించటం లేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో పనులను గురువారం పరిశీలించనున్నారు.

రంగంలోకి అమాత్యులు పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తిచేసి సాగునీరందించాలన్నది సర్కారు లక్ష్యం. ఏడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పనులు కొలిక్కి రాలేదు. ఆది నుంచే అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయి. భూసేకరణ ప్రక్రియకే దాదాపు రెండేళ్లు పట్టింది. తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించటంతో పనులు ముందుకు సాగలేదు. తదనంతరం పనులు గాడినపడ్డట్టు అనిపించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. 2023లో శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ఈప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సమీక్షలు జరిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేయటంతో పనులు మళ్లీ గాడినపడ్డాయి. రాష్ట్రంలో సార్వత్రిక సమరం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియటంతో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని సీఎం, మంత్రులు ప్రకటించారు. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించనున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఓచోట రిజర్వాయర్ నిర్మించాలని సర్కారు యోచిస్తోంది. 10– 13 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరింది. మంత్రుల తాజా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణంపైనా కీలక నిర్ణయం వెలువడే అవకాశముంది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం ఖమ్మం జిల్లాలో 4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. ప్రాజెక్టులో మొత్తం నాలుగు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించారు. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. భద్రాద్రి జిల్లాలోని 1– 8 ప్యాకేజీల్లో 114 కి.మీ. పొడవు ప్రధాన కాల్వ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. సత్తుపల్లి ట్రంకు పనులను 9–12 ప్యాకేజీలుగా విభజించారు. కాల్వ పొడవు 116 కి.మీ. ఉంటుంది. యాతాకులకుంట టన్నెల్, గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ పనులు సాగుతున్నాయి. పాలేరు ట్రంక్ పనులను 13– 16 ప్యాకేజీల కింద చేపట్టారు. 79 కి.మీ. పొడవు కాల్వలు నిర్మించాల్సి ఉంది.

## చీర కట్టు, ముక్కు పుడకతో ముద్దుగుమ్మ అదుర్స్

మంచు మనోజ్ తో కలిసి ఝుమ్మంది నాదం సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ తాప్సి. టాలీవుడ్ లో కెరీర్ ఆరంభించిన ఈ అమ్మడు ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. బాలీవుడ్ సూపర్ స్టార్, బాద్ షా షారుఖ్ ఖాన్ తో కలిసి ఈ అమ్మడు చేసిన సినిమా డుంకీ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో కమర్షియల్ గా ఈ అమ్మడు మరింత బిజీగా సినిమాలు చేయబోతుంది. ఇంతకు ముందు లేడీ ఓరియంటెడ్ సినిమాలు మాత్రమే చేసిన ఈ అమ్మడు ఇప్పుడు అన్ని సినిమాలు చేస్తుంది.



సోషల్ మీడియాలో ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన చీర కట్టు ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా చీర కట్టు లో నడుము నాభి అందం చూపిస్తే వైరల్ అవుతాయి. ఈ ఫోటోల్లో పెద్దగా స్కిన్ షో చేయకున్నా కూడా భలే ఉందే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముక్కు పుడక పెట్టుకుని, చీర కట్టుకుని ఈ అమ్మడు కెమెరా కి ఇచ్చిన ఫోజ్ లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తెలుగు లో మళ్లీ ఈ అమ్మడు స్టార్ హీరోలకు జోడీగా నటించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ఇంతటి అందగత్తెకు టాలీవుడ్ లో దక్కాల్సిన గుర్తింపు, అవకాశాలు దక్కలేదు. కానీ బాలీవుడ్ లో మాత్రం ఈ అమ్మడికి మంచి ఆఫర్లు దక్కాయి అనేది ఆమె ఫ్యాన్స్ మాట. అందుకే టాలీవుడ్ లో మళ్లీ అమ్మడు బిజీ అవ్వాలని వారు ఆశ పడుతున్నారు.

## సమంత ఫిట్‌నెస్ రొటీన్ బ్యాలెన్స్‌డ్ మెనూ

ఫిట్‌నెస్ ఫ్రీక్ సమంత రూత్ ప్రభు దినచర్య గురించి పరిచయం అవసరం లేదు. నిరంతర వ్యాయామం, యోగా సెషన్స్ .. ఆహార నియమాలను అనుసరించడంలో సామ్ అందరికీ స్ఫూర్తి. తన జిమ్ షెడ్యూళ్ల గురించి, తీసుకునే ఆహారం గురించి నిరంతరం సోషల్ మీడియాల్లో అభిమానులతో చాలా విషయాలను షేర్ చేస్తుంటారు. ఇప్పుడు తాజా పోస్టులలో పోషకాహారం..వ్యాయామ నియమావళిని సమంత షేర్ చేసారు. సామ్ ఇన్ స్టాలో షేర్ చేసిన మెనూలో తగినంత మొత్తంలో ప్రోటీన్, ఫైబర్, ఉడకబెట్టిన వెజ్ పులుసు.., ప్రోబయోటిక్స్‌తో కూడిన సమతుల్య లంచ్ మెనూకి సంబంధించిన ఒక ఫోటోని షేర్ చేసింది. తదుపరి మిర్రర్ సెల్ఫీ లో ట్రైనింగ్, సెషన్ 1 వెయిట్ ట్రైనింగ్ అని సమంత రాసింది. మరో క్లిక్ లో మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ రాకేష్ యాదవ్‌తో సెల్ఫీ ని షేర్ చేసి ఈ ఫోటోకి సెషన్ 2 మార్షల్ ఆర్ట్స్ అని క్యాప్షన్ ఇచ్చింది. చివరగా



అలసిపోయి కుర్చీలో ఒంటరిగా కూర్చుని సెషన్ 3 డెడ్ అని రాసి ఉన్న ఓ ఫోటోని సామ్ షేర్ చేసారు. స్వయం ప్రతిరక్షక వ్యాధి మయోసిటిస్‌తో బాధపడుతున్నప్పటి నుండి శరీరం, మనస్సు రెండింటినీ స్థిరంగా - ఉంచుకోవడం ద్వారా సమంత తిరిగి ఆరోగ్యంగా మారింది. దీంతో ఫిట్ నెస్ ప్రాముఖ్యతను సమంత నిరంతరం ప్రచారం సాగిస్తోంది. ముఖ్యంగా ఇన్ స్టా వేదికగా తన అభిమానులకు సామ్ ఫిట్ నెస్ క్లాసులు తీసుకుంటోంది. దీనికి ఫ్యాన్స్ నుంచి స్పందన అద్భుతంగా ఉంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... సమంత తదుపరి తెలుగు చిత్రం బంగారంలో కనిపించనుంది. ఈ సినిమాతో నిర్మాతగాను ఆరంగేట్రం చేస్తుంది. వరుణ్ ధావన్‌తో కలిసి సిటాడెల్: హనీ బన్నీలో నటించింది. రాజ్ అండ్ DK దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఈ సంవత్సరం OTTలో ప్రీమియర్ అవుతుంది.




## 'క్యూజీ' గ్యాంగ్ కూడా 'దండుపాళ్యం' తరహాలోనా?



'దండుపాళ్యం' గ్యాంగ్ అప్పట్లో థియేటర్లో ఎలాంటి సంచలనాలు నమోదు చేసిందో తెలిసిందే. సౌత్ లో దండుపాళ్యం ఫ్రాంచైజీ మంచి సక్సెస్ అయింది. మళ్లీ అలాంటి గ్యాంగ్ నే తలపిస్తోంది ఈ 'క్యూజీ' 'కొటేషన్ గ్యాంగ్'. ప్రియమణి, సన్నీ లియోన్, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో వివేక్ కె.కన్నన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇది కూడా భయంకరమైన క్రైమ్ స్టోరీ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ముంబై, కశ్మీర్, చెన్నై ప్రాంతాల మధ్య కిరాయి హత్యలు చేసే గ్యాంగ్‌లకు సంబంధించిన కథ ఇది. ఓ హత్య కేసుతో ఈ మూడు ప్రాంతాలకు ఎలా కనెక్ట్ అయింది? అన్నదాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా మలుస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. క్రైమ్ అంశాలు ఒళ్లు గగుర్లుపొడిచేలా ఉన్నాయి. సన్నివేశాలు అచ్చంగా దండుపాళ్యం గ్యాంగ్ నే తలపిస్తున్నాయి. ఎంతో రియలిస్టిక్ ఫీల్ ని తీసుకొస్తున్నాయి. ఈ సినిమా తెలుగు వెర్షన్ రిలీజ్ రైట్స్ ని రుషికేశ్వర్ ఫిలింస్ పై ఎం వేణుగోపాల్ రిలీజ్ చేస్తున్నారు. రిలీజ్ కి రెడీ అవుతోన్న ఈ సినిమా గురించి నిర్మాత వేణుగోపాల్ తాజా అప్ డేట్ అందించారు. 'ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ కి మేం అనుకున్న దానికంటే గొప్ప రెస్పాన్స్ వచ్చింది. జాకీ, ప్రియమణి, సన్నిలియోన్ పాత్రలు సినిమాలో పోటాపోటీగా సాగుతాయి. క్రైమ్ సన్నివేశాలు చాలా కొత్తగా ఉంటాయి. మునుపెన్నడు ఇలాంటి సన్నివేశాలు చూసి ఉండరు. కంటెంట్ ఉంటే కటౌట్ తో పనిలేదని తెలుగు ఆడియన్స్ రుజువు చేస్తున్నారు. చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా లేకుండా ప్రేక్షకులు సినిమాని ఆదరిస్తున్నారు. అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తాం' అని అన్నారు.

## జాన్వీ కపూర్ కి చెమటలు పట్టించారు..!



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్ మరియు టాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ లో ఇటీవల ఒక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వీ కపూర్ వరుస షూటింగ్స్ కారణంగా ట్రావెల్ చేస్తూనే ఉంటుంది. ఇటీవల ముంబై ఎయిర్ పోర్ట్ లో జాన్వీ కపూర్ కి చేదు అనుభవం ఎదురైంది. అక్కడ తన గార్డ్స్ లేక పోవడంతో పాటు, ఎయిర్ పోర్ట్ సిబ్బంది కూడా లేని కారణంగా ఫ్యాన్స్ పెద్ద ఎత్తున ఆమెను చుట్టుముట్టారు. సెల్ఫీ లు అంటూ ఆమెను ఇబ్బంది పెట్టడంతో పాటు ఫిజికల్ గా ఇబ్బంది పెట్టారట. అందుకు సంబంధించిన ఫోటోలు మరియు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సెలబ్రిటీలకు ఇలాంటి పరిస్థితులు కామన్ గా జరుగుతూ ఉంటాయి. అయితే ఎయిర్ పోర్ట్ లో ఇలా జరగడం మాత్రం చాలా అరుదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నిమిషాల పాటు జాన్వీ కపూర్ ను చుట్టు ముట్టిన జనాలు ఆమెను అక్కడ నుంచి అడుగు కదలకుండా చేశారట. దాంతో జాన్వీ కపూర్ కి ముచ్చెమటలు పట్టి, అక్కడ నుంచి ఎలా బయట పడాలో తెలియక గుండె జారి పోయినంత పనైందట. ఈ విషయాన్ని జాన్వీ సన్నిహితుల వద్ద వెల్లడించిందట. ఇకపై జాన్వీ కపూర్ ఒంటరిగా ఎయిర్ పోర్ట్ కి వెళ్ల కూడదని కూ డా నిర్ణయించుకుందట. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే బాలీవుడ్ లో ప్రస్తుతం రెండు సినిమాలను చేస్తుంది. మరో వైపు టాలీవుడ్ లో ఈ అమ్మడు రెండు సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. హిందీ సినిమాల కంటే కూడా ఎక్కువగా అందరి దృష్టి టాలీవుడ్ సినిమాల మీద ఉంది. మొదటిది ఎన్టీఆర్ తో చేస్తున్న దేవర కాగా, రెండోది చరణ్ కు జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలు జాన్వీ కపూర్ ను పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ గా నిలపడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## పదేళ్లైనా ఇప్పటికీ అదే లవ్.. బుట్టలో పడేసేలా హీరోయిన్ కామెంట్స్..!

మద్రాస్ కేఫ్ సినిమాతో సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చిన రాశి ఖన్నా మొదటి సినిమా బాలీవుడ్ లో చేసినా ఆ వెంటనే టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది. అక్కినేని ఫ్యామిలీ కలిసి చేసిన మనం సినిమాలో చిన్న రోల్ చేసిన అమ్మడు ఆ తర్వాత అవసరాల శ్రీనివాస్ డైరెక్షన్ లో నాగ శౌర్య హీరోగా చేసిన ఊగలు గుసగుసలాడే సినిమాలో నటించింది. అప్పటి నుంచి తెలుగులో కెరీర్ కొనసాగించిన రాశి ఖన్నా స్టార్ క్రేజ్ తెచ్చుకోలేదు కానీ యువ హీరోలతో జత కడుతూ పాపులారిటీ అయితే తెచ్చుకుంది. మధ్యలో తమిళ సినిమా అవకాశాలను కూడా అందుకున్న అమ్మడు అక్కడ ఇక్కడ రెండు చోట్ల ఛాన్సులను రాబట్టుకుంటుంది. రీసెంట్ గానే ఊహలు గుసగుసలాడే సినిమా రిలీజై పదేళ్లు పూర్తి చేసుకోగా ఆ సినిమా గురించి పదేళ్ల తన సినీ జర్నీ గురించి చెప్పుకొచ్చింది రాశి ఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమా సక్సెస్ తనకు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని. ఆ సినిమా ద్వారానే తెలుగు ప్రేక్షకులు తనను యాక్సెప్ట్ చేశారని



చెప్పింది రాశి ఖన్నా. అంతేకాదు కెరీర్ ఎలా ఉన్నా తెలుగు ప్రేక్షకుల నుంచి తనకు అపారమైన ప్రేమ అభిమానం దక్కుతుందని చెప్పుకొచ్చింది రాశి ఖన్నా. మొదటి సినిమా టైం లో ఇక్కడ భాష సంస్కృతి తెలియకపోయినా ఇక్కడ ఆడియన్స్ తనని ఆదరించారని.. తొలి సినిమాకు వచ్చిన ప్రశంసలను ఎప్పటికీ మర్చిపోను అంటుంది అమ్మడు. అందం అభినయం రెండు ఉన్నా సరైన టైం లో అమ్మడు చేసుకున్న కథల ఎంపిక వల్ల రాశి ఖన్నా సగటు హీరోయిన్ గానే మిగిలిపోయింది. అవసరమైనప్పుడల్లా గ్లామర్ షోతో రెచ్చిపోయినా ఎందుకో అమ్మడు కెరీర్ లో అనుకున్నంత డిమాండ్ సంపాదించలేకపోయింది. అయితే ఇప్పటికీ తెలుగు తమిళ భాషల్లో అరకొర ఛాన్సులు అందుకుంటుంది రాశి. ప్రస్తుతం అమ్మడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో అమ్మడితో పాటుగా కె.జి.ఎఫ్ భామ శ్రీనిధి శెట్టి కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. తెలుగులో దాదాపు యువ హీరోలందరితో నటించిన రాశి ఖన్నా స్టార్ సినిమా ఛాన్స్ లు రాబట్టడంలో వెనకబడింది. ఈమధ్య సోషల్ మీడియాలో గ్లామర్ షోతో మరింత రెచ్చిపోతున్న అమ్మడు తాను ఇంకా ఫాం లోనే ఉన్నా అని చెప్పకనే చెబుతుంది. మరి రాశి ఇన్నింగ్స్ కి బూస్టింగ్ ఇచ్చే సినిమా ఒక్కటి పడితే మాత్రం కెరీర్ మళ్లీ ఊపందుకునే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.

## శ్రీలీల మరో బాలీవుడ్ మూవీ.. ఆమె కూడా!

పెళ్లి సందడి మూవీతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన శ్రీలీల.. ఆ తర్వాత రవితేజ ధమాకాతో పెద్ద హిట్ అందుకున్న విషయం తెలిసిందే. తెలుగులో వరుసగా ఆఫర్లు దక్కించుకుని స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. కానీ ఆ తర్వాత ఆమె ఖాతాలో డిజాస్టర్లు వచ్చి చేరాయి. 2024 సంక్రాంతికి వచ్చిన మహేష్ బాబు గుంటూరు కారంతో కూడా హిట్ కొట్టలేకపోయింది. భగవంత్ కేసరి తర్వాత ఆమె చేసిన అన్ని సినిమాలు నిరాశపరిచాయి. అయినప్పటికీ శ్రీలీల క్రేజ్ అస్సలు తగ్గలేదు. ప్రస్తుతం తెలుగులో మూడు సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ.. బాలీవుడ్ లో కూడా ఆఫర్లు అందుకుంటోంది. త్వరలోనే సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ డైలర్ మూవీతో శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ ఇవ్వనున్నట్లు వార్తలు వచ్చాయి. అందుకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ రాకముందే మరో మూవీ ఆఫర్ ను ఆమె ఇప్పుడు దక్కించుకున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వస్తోంది.



బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ తో శ్రీలీల యాక్ట్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బేబీ జాన్, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి వంటి పలు సినిమాలతో బిజీగా ఉన్న వరుణ్.. తన తండ్రి డేవిడ్ ధావన్ డైరెక్షన్లో ఓ సినిమా చేయనున్నారు. అందులో హీరోయిన్ గా శ్రీలీలను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆమెతో పాటు ఆ మూవీలో మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కనున్న ఈ సినిమా.. హీరో ట్రయాంగిల్ లవ్ స్టోరీ చుట్టూ తిరగనున్నట్లు తెలుస్తోంది. అందుకే శ్రీలీల, మృణాల్ ఠాకూర్ ను మేకర్స్ ఎంచుకున్నట్లు సమాచారం. అయితే శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ ఖరారు అయినట్లు వార్తలు వస్తున్నా.. ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. ఇంతలో శ్రీలీలకు మరో ఆఫర్ కూడా వచ్చినట్లు ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. మరి ఏ సినిమా ముందు పట్టాలెక్కుతుందో వేచి చూడాలి. మరోవైపు, వరుస షూటింగ్స్ తో బిజీ బిజీగా గడుపుతున్న హీరో వరుణ్ ధావన్.. త్వరలో సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. స్టార్ హీరోయిన్ సమంత ఫిమేల్ లీడ్ రోల్ పోషించిన ఈ సిరీస్.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. శ్రీలీల చేస్తున్న రాబిన్ హుడ్ డిసెంబర్ లో రిలీజ్ కానుంది. మృణాల్.. కల్కి మూవీలో మెరవనున్నట్లు టాక్. మరి వీరు ముగ్గురు కలిసి చేసే సినిమా ఎలా ఉంటుందో చూడాలి.



# కేటీఆర్‌కు మాస్ వార్నింగ్

## తాగుబోతులు, దొంగల విగ్రహాలకు సచివాలయం ముందు స్థానం లేదు

హైదరాబాద్: భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. సోమాజిగూడలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. పీసీసీ మాజీ చీఫ్ వీహెచ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ ఇన్‌చార్జి మున్షీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను నేతలు గుర్తుకుతెచ్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**చేతనైతే రాజీవ్ విగ్రహం ముట్టుకోండి..** "ఎవడికైనా చేతనైతే రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకోండి. రాజీవ్ విగ్రహాన్ని ముడితే చెప్పు తెగే దాకా కొడుతాం. రాజీవ్ విగ్రహం ఎవరు ముడుతారో, ఎప్పుడు ముడుతారో చెపితే మా జాగ్గారెడ్డిని పంపిస్తాం. తాగుబోతులు, దొంగల విగ్రహాలకు సచివాలయం ముందు స్థానం లేదు. తొందరలోనే రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందాం. పండగ వాతావరణంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం. రాజీవ్ విగ్రహాన్ని పెడతామంటే తొలగిస్తామని కొందరు సన్నాసులు అంటున్నారు.

అధికారం పోయినా బలుపు తగ్గలేదు. బలుపును తగ్గించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు. వాళ్ల అయ్య విగ్రహం పెట్టుకోవాలని కేటీఆర్ అనుకుంటున్నాడు. వాళ్ల అయ్య పోయేదెప్పుడు? విగ్రహాన్ని పెట్టేదెప్పుడు. ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొన్నారు. తాగుబోతు సన్నాసి విగ్రహం సెక్రటేరియట్ ముందు పెడుతారా?. తెలంగాణను దోచుకున్న దొంగ విగ్రహం పెట్టాలా" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**మీరు చింతమడకకే పరిమితం..** "పొద్దున లేస్తే తాగేవాడి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెడుతారా? నీ అయ్య విగ్రహం కోసం రాజీవ్ విగ్రహాన్ని తొలగించాలని అంటావా?. అధికారంలోకి వస్తే అని మాట్లాడుతున్నాడు... బిడ్డా.. మీకు అధికారం ఇక కలనే.. ఇక మీరు చింతమడకకే పరిమితం. పదేళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని వాళ్లు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత మాది. మా చిత్తశుద్ధిని ఏ సన్నాసి శంకించనవసరం లేదు. విచక్షణ కోల్పోయి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తుంది. కలలో కూడా నీకు అధికారం రాదు. పది సంవత్సరాల్లో తెలంగాణ తల్లి విగ్రహం గుర్తు రాలేదా? బీఆర్ఎస్ నాయకులు ఇష్టమున్నట్టు మాట్లాడితే సామాజిక బహిష్కరణ చేస్తాం. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం" అని అన్నారు.

**రాజీవ్‌పై రేవంత్ ప్రశంసలు..** "దేశ యువతకి రాజీవ్ గాంధీ స్ఫూర్తి. విప్లవాత్మకమైన చైతన్యానికి కారణం రాజీవ్ గాంధీ. ఇండియా ప్రపంచంతో పోటీ పడుతుందని గుర్తించింది రాజీవ్ గాంధీ. టెక్నాలజీ మాత్రమే కాకుండా సామాజిక చైతన్యం ఉన్న వ్యక్తి రాజీవ్ గాంధీ. మహిళలకు ప్రాధాన్యం ఉండాలని మహిళా సాధికారతకు అడుగులు వేసినవారు రాజీవ్ గాంధీ. దేశ సమగ్రత కోసం రాజీవ్ ప్రాణత్యాగం చేశారు. ఒలింపిక్స్‌లో చిన్న దేశం సౌత్ కొరియా కంటే ఇండియా ప్రదర్శన పేలవంగా ఉంది.

1921 నుంచి 1931 వరకు గాంధీ న డిపిన పత్రిక పేరు యంగ్ ఇండియా. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ త్వరలోనే నెలకొల్పుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.



# తడిసి ముద్దయిన భాగ్యనగరం

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**ఇందిరానగర్‌లో కొట్టుకుపోయిన వ్యక్తి...** కుండపోత వర్షంతో హైదరాబాద్ నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రధాన రహదారులపై మోకాళ్లలోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుండపోత వర్షంతో హైదరాబాద్ నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రధాన రహదారులపై మోకాళ్లలోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరానగర్‌లో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఓ వ్యక్తి వరదలో కొట్టుకుపోయాడు. భారీ వర్షంతో నగర వ్యాప్తంగా కాలనీలన్నీ జలమయమయ్యాయి. పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని విద్యాసంస్థలకు నేడు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.





## రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ పోరాటం.. ధర్నాకు పిలుపు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు చేసిన రుణ మాఫీపై ఇంకా రాద్ధాంతం నడుస్తూనే ఉంది. 40 శాతం మందికి రుణమాఫీ జరగలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా.. ఆధార్, బ్యాంక్ అకౌంట్లు లాంటి సమస్యలతో నిలిచిపోయిన విషయం వాస్తవమేనని రేవంత్ సర్కార్ చెబుతున్న పరిస్థితి. ఈ క్రమంలో ఎల్లుండి (ఆగస్టు-22న) రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ధర్నాలకు పిలుపునిచ్చింది. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ 22న మండల, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ధర్నాకు దిగుతోంది. ధర్నాకు సంబంధించి ఈ కీలక ప్రకటనను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు.

**ఆగదు.. ఆగదు..! :** ' తెలంగాణలో 40 శాతం మంది రైతన్నలకు రుణమాఫీ జరగలేదు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ పూర్తయిందని చెబుతున్నారు. మంత్రులు తలా ఓ మాట చెబుతూ రైతన్నలను అయోమయానికి గురి చేస్తున్నారు. అనేక ఆంక్షలు పెట్టి రైతన్నలను మోసం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి.

వెంటనే అందరికీ వ్యవసాయ రుణమాఫీ చేస్తామని ప్రకటన చేయాలి. అప్పటిదాకా ప్రభుత్వం పైన మా పోరాటం ఆగదు. అందులో భాగంగానే ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నాం' అని కేటీఆర్ ప్రకటించారు.

**తలాతోక లేకుండా..!** రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.31 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్టు చెప్పడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాతోక లేకుండా రోజుకో తీరుగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రేమో రుణమాఫీ పూర్తి చేసినట్లు డబ్బా కొడుతున్నారని.. మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం రుణమాఫీ పూర్తి కాలేదంటున్నరని అన్నారు. మొన్న ఖమ్మం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి రూ.18వేల కోట్లతో రుణమాఫీ పూర్తిగా చేసినట్లు ప్రకటించారన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తికాలేదని.. ఇంకా 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామన్నారని తెలిపారు. మరో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇంకా 17 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటున్నారన్నారు. ఇక ఈరోజు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే పచ్చి అబద్ధం చెప్పారని అన్నారు. ఏకంగా 31వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్లు ప్రకటించారని.. ఏది నిజం. ఇందులో ఎవరి మాటలు నమ్మాలో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. ఒకవైపు రుణమాఫీ కాక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడి మరింత గందరగోళం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# భూభరోసానిస్తాం

## కొత్త చట్టంతో ధరణి సమస్యలకు ముగింపు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్ : ధరణి పోర్టల్‌లోని సమస్యలు పునరావృతం కాకుండా భూహక్కులకు హామీ ఇచ్చేలా కొత్త రెవెన్యూ చట్టం ఉండాలని నిపుణులు, రెవెన్యూ అధికారులు అభిప్రాయపడ్డారు. ధరణి చట్టం అమల్లోకి వచ్చినా మార్గదర్శకాలు రూపొందించకపోవడం వల్ల నష్టం జరిగిందన్నారు. ఇప్పుడు కొత్త చట్టంలో ఈ పరిస్థితి రాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని సర్కార్‌కు సూచనలు చేశారు. ధరణి పోర్టల్ వల్ల ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు, బాధలకు త్వరలో చరమగీతం పాడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## టూరిజం డెవలప్ మెంట్‌తో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి




జయశంకర్ భూపాలపల్లి: పర్యాటక రంగ అభివృద్ధిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలం కొడవటంచలో మంత్రి పర్యటించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఆలయ అధికారులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. లక్ష్మీనృసింహస్వామిని మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, నాగరాజు దర్శించుకున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... వరంగల్‌లో పర్యాటక ప్రాంతాల్లో వసతులను మెరుగుపరుస్తామని చెప్పారు. రాష్ట్రంలో టూరిజం డెవలప్ మెంట్ వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. రామప్ప టెంపుల్ అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపడతామన్నారు. కొడవటంచ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వసతి ఏర్పాట్లు కల్పిస్తామని మాటిచ్చారు. సాంస్కృతిక, కళా, వారసత్వ సంపద మనకు వరమని వివరించారు. అపారమైన అడవులు, చారిత్రక ఆలయాలు, కోటలు ఇక్కడ ఉన్నాయని చెప్పుకొచ్చారు. అన్ని వర్గాల ప్రజలు ఆహ్లాదం కోసం ప్రతినెల పర్యటన చేయాలని అన్నారు. అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన ఆలయం రామప్ప అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం



హైదరాబాద్, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... రాజీవ్ గాంధీ మిస్టర్ క్లీన్ ప్రధానిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. సద్భావన యాత్ర మొదలు పెట్టింది రాజీవ్ గాంధీ అని తెలిపారు. పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చి కంప్యూటర్‌ను పరిచయం చేశారన్నారు. హైదరాబాద్‌లో కప్యూటర్ రంగంలో ముందుకు పోవడానికి కారణం ఆ నాటి ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్దన్ రెడ్డి , రాజశేఖర్ రెడ్డి అని చెప్పుకొచ్చారు. 18 ఏండ్లకే యువత పాలనలో భాగస్వామ్యం కావాలని 18 ఏండ్లకే యువకులకు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. కొంత మంది కుట్రదారులు కుట్ర చేసి రాజీవ్ గాంధీని చంపారని మండిపడ్డారు. ఆయన ఆశయసాధన కోసం అందరూ ముందుకు పోతున్నారని.. అందుకే ప్రతి ఏటా ఆయన జయంతిని ఘనంగా నిరవహిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ దీపాదాస్ మున్సీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ బలరాం నాయక్, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి,మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు పాల్గొన్నారు.

## వారికి రుణాలివ్వండి.. బ్యాంకర్లతో ఉపముఖ్యమంత్రి..



హైదరాబాద్, ఆగస్టు 20: ప్రజా భవన్‌లో జరిగిన బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక కామెంట్స్ చేశారు. లెక్కలు కాదు ఆత్మ ఉండాలన్నారు. ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు బ్యాంకులకు అందించామని.. రైతులకు మాత్రం నేటి వరకు రూ. 7,500 కోట్లు మాత్రమే చేరాయని అన్నారు. రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తామన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నామని భట్టి తెలిపారు. ఉచితంగా 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ ద్వారా రైతులను రుణ విముక్తులను చేస్తున్నామని.. ఇది వ్యవసాయం అనుబంధ రంగాలను బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుందన్నారు భట్టి విక్రమార్క. ఇన్నోవేటివ్ పాలసీలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ. 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని.. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు భట్టి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. మొదటి క్వార్టర్‌లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులు ఇప్పటివరకు 40.62% వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నగదు నిల్వల నిష్పత్తి మొదటి క్వార్టర్‌లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం అని అన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వరి ఉత్పత్తిలో పెరుగుదల అంశం.. ఎఫ్‌సీఐకి వరిని సరఫరా చేసే రాష్ట్రాల్లో ప్రధాన రాష్ట్రంగా ఎదగడానికి వీలు కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగుకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు.

# రుణమాఫీపై రైతులు కంగారు పడొద్దు

సిద్దిపేట జిల్లా: రుణమాఫీపై బీజేపీ, బీఆర్ఎస్ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు చేశారు. రుణమాఫీపై రైతులు కంగారు పడొద్దని.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ లోపు రూ.2 లక్షలు రుణాలు పొందిన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు. మంగళవారం(ఈరోజు) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణలో రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని వివరించారు. పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలో ఉండి రైతులకు ఏం చేశారని ఆందోళన చేస్తున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి ఓట్లు బదలాయింపు చేసుకున్న 8 సీట్లు దాటలేదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని.. మిగిలినవి పూర్తి చేసే పనిలో ఉన్నామని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా అక్కా చెల్లెలు సంతోషంగా బస్సులో ప్రయాణించేందుకు కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు తెలిపారు. దాదాపు రూ. 15 కోట్లు ఆదాయం సమకూరిందని చెప్పారు. దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సెక్రెటరీ ముందు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవగాహన లేకుండా మాజీ మంత్రి కేటీఆర్ రాజీవ్ విగ్రహాన్ని కూల్చివేస్తామని మాట్లాడడం సరికాదన్నారు. కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని వార్నింగ్ ఇచ్చారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా అని అడిగారు. మాజీ సీఎం కేసీఆర్ ట్యూనింగ్ చేస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మ్యూజిక్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే వారికి వారు అవమాన పరచుకున్నట్లేనని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏమైనా సంబంధం ఉందా..?

హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏమైనా సంబంధం ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ రాగానే సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టి తీరుతామని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో జగదీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని మళ్లీ అధికారంలోకి వస్తే పెడదామని అనుకున్నామని చెప్పారు. ఆ విషయం ముందే ప్రకటించామని అన్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణ పేరు తెలుసా అని విమర్శించారు. రాజీవ్ గాంధీ తెలంగాణకు ఒక్కరూపాయి మేలు చేశారా అని నిలదీశారు. చిల్లర చేష్టలు తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదని చెప్పారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టిన చోట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నిర్ణయం జరిగిందని వెల్లడించారు. రుణమాఫీపై కాంగ్రెస్ పగటి దొంగలా దొరికిందని విమర్శించారు. రూ.17లక్షల 13వేల మందికి ఇంకా రుణమాఫీ జరగలేదని స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒప్పుకున్నారని తెలిపారు. రుణమాఫీ పడని రైతులకు ఏ తేదీలోపు చేస్తారో చెప్పాలని నిలదీశారు. సీఎం రేవంత్ రుణమాఫీ పూర్తి అయిందని డ్యాన్స్ లు చేస్తున్నారని విమర్శలు చేశారు. మంత్రులు రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని అంటున్నారని.. సీఎం రేవంత్ చెప్పింది పచ్చి అబద్ధమని ఉత్తమ్ మాటలతో తేలిపోయిందన్నారు. అబద్ధం చెప్పినందుకు సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముక్కు నేలకు రాసి చెంపలు వేసుకోవాలని అన్నారు. రుణమాఫీ కోసం రైతులకు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని చెప్పారు. ఒక్కో మంత్రి ఒక్కో రకంగా చెబుతున్నారన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదని జగదీష్ రెడ్డి ఆరోపణలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com